

• వరాలివ్వమ్మా.. వరలక్ష్మి

శ్రావణ మాసం.. ఆఖరి శుక్రవారం జిల్లాలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారికి విశేష పూజలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిపారు. కుంకుమార్చనలు, సామూహిక పారాయణలు నిర్వహించారు. ద్వారకా తిరుమలలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా చేశారు.



అన్ని పాఠశాలల్లో సుగర్ బోర్డులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):వేగంగా విస్తరిస్తున్న మధుమేహాన్ని నియంత్రించే చర్యల్లో భాగంగా బాల బాలికలకు అవగాహన నిమిత్తం జాతీయ బాలల హక్కుల కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) సూచనల మేరకు అన్ని పాఠశాలల్లో సుగర్ బోర్డులను ప్రదర్శించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. అధిక మోతాదులో చక్కెర, చక్కెరతో తయారుచేసే ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్స్, సాఫ్ట్ డ్రింక్‌ల వినియోగం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలు, అనారోగ్యం, అనర్థాలను సుగర్ బోర్డుల్లో స్పష్టంగా తెలిపేలా ప్రదర్శించాలని సూచించారు. వీటికి ప్రత్యామ్నాయంగా పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పేర్కొంటూ, వాటినే ఆహారపు అలవాట్లుగా పిల్లలను ప్రోత్సహించేలా బోర్డుల్లో వివరాలను పొందుపర్చాలని కోరారు. సుగర్ బోర్డులను ఈ నెల 30వ తేదీలోగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, తరగతి గదుల్లో అందరికీ స్పష్టంగా కనబడేలా ఏర్పాటు చేయించాల్సిన బాధ్యత డీఈవోలు, ఆర్జేడీలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు

» మంత్రి వీసీలో కలెక్టర్ వెట్రిసెల్వి వెల్లడి

ఏలూరుసిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఎరువుల కొరత లేదని, జిల్లాలో సాగుకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడికి తెలిపారు. రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం సెక్రటరియేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు అవసరమైన ఎరువులు, డీఏపీ నిల్వలు ఉన్నాయని, ఎటువంటి కొరత లేదని, ఈ విషయాన్ని గ్రామ స్థాయిలోని వ్యవసాయ శాఖాధికారులు రైతులకు తెలియజేస్తున్నారన్నారు. జిల్లాలో ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచేవారిపై కేసులు నమోదు చేస్తున్నామని, అంతేగాక ఎవరైనా డీలర్లు ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ చేసినా, అధిక ధరలకు అమ్మినా వారిపై కేసులు నమోదు చేస్తున్నామని మంత్రికి కలెక్టర్ తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):సెప్టెంబరు ఐదో తేదీ గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేసేందుకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో పనిచేస్తున్న టీచర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన టీచర్లు, హెచ్‌ఎంలు అర్హులు. విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కృషిచేసి ఉండాలి. ఆరోపణలు/క్రమశిక్షణ చర్యలు/క్రిమినల్ కేసులున్న ఉపాధ్యాయులు అనర్హులు. దరఖాస్తులను సంబంధిత మండల/డివిజన్ ఎంఈవో, డీవైఈవోల ద్వారా ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా పంపాలి. దరఖాస్తు నమూనాలను తనిఖీ అధికారుల నుంచి పొందవచ్చు. జిల్లా కమిటీ పరిశీలన అనంతరం వారికి వచ్చిన మార్కుల ప్రాతిపదికన అవార్డులకు తుది ఎంపికలు జరుగుతాయి.


ఎస్పీ రవికిశోర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే చింతమనేని


అబ్బయ్యచౌదరిని పరామర్శించడానికి వచ్చిన పేర్ని నాని, వైసీపీ నేతలు

లీజు మంటలు!

» దెందులూరులో ఈ అంశంపైనే బాహాబాహీ
» వైసీపీ ముసుగులో రౌడీలా.. అంటూ ఎస్పీకి ఎమ్మెల్యే ప్రభాకర్ ఫిర్యాదు
» లీజు సొమ్ములు తేల్చాల్సిందేనంటూ పట్టు
» కావాలనే అరాచకాలు : మాజీ మంత్రి పేర్ని నాని
» అబ్బయ్యకు మద్దతుగా తరలి వచ్చిన వైసీపీ నేతలు

'సాఫ్ట్‌వేర్ ముసుగులో అబ్బయ్యచౌదరి చేసిన క్రిమినల్ నేచర్ బయటపడింది. కాబట్టే కనీసం వాళ్ల స్థానిక వైసీపీ కార్యకర్తలు, జనం కూడా రావడం లేదు. బయట ప్రాంతాల నుంచి రౌడీ షీటర్లను, అల్లరి మూకలను తెచ్చి పెట్టుకున్నారు. పైగా అతనికి ఏదో నష్టం వాటిల్లినట్టు వైసీపీ, ఇతర నాయకులు దొంగ పరామర్శలు చేస్తున్నారు.'
- దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని

'అధికారంలోకి వచ్చిన తర్వాత అట్టుకు అట్టున్నర చెల్లిస్తాం. ప్రత్యర్థుల ఆస్తులను ధ్వంసం చేయడం, మాజీ ఎమ్మెల్యే అయిన అబ్బయ్య చౌదరిపై భౌతిక దాడికి ఉసిగొలిపారు. రాజకీయం చేయకుండా రౌడీయిజం చేస్తున్నారు. దీనిని చూస్తూ ఊరుకోం.'
- మాజీ మంత్రి పేర్ని నాని

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

దెందులూరు నియోజకవర్గంలో మరోమారు తెలుగుదేశం, వైసీపీ పక్షాలు బాహాబాహీకి దిగాయి. నువ్వా నేనా అని తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నాయి. కొన్ని మాసాలుగా కొల్లేరు లీజు వివాదం ఈ రెండు పార్టీల మధ్య చిచ్చు పెట్టింది. కొల్లేరులో లీజు సొమ్ములు మింగేసిన అబ్బయ్యచౌదరి పత్తా లేకుండా పోయారని, ఆఖరుకి తీసుకున్న సొమ్మును తిరిగి చెల్లించకుండా ఎదురుదాడి చేస్తున్నారు. పేదలకు న్యాయం జరగకపోతే చూస్తూ ఊరుకోబోమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కొల్లేరువాసుల పక్షాన నిలిచారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న అబ్బయ్య చౌదరి కొల్లేరువాసులకు చెందాల్సిన లీజు సొమ్మును కాజేశారన్నది అక్కడి వాసుల ఆరోపణ. తనకేమీ సంబంధం లేదని టీడీపీ కావాలని రెచ్చగొడుతూ, రాజకీయం చేస్తోందని అబ్బయ్యచౌదరి ప్రతీ మూడు నెలలకోసారి బహిరంగ వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి తమకు చెందాల్సిన లీజు సొమ్ములను చెల్లించాల్సిందేనని ఆయన ఇంటి ఎదుట కొల్లేరువాసులు నిరసనలకు దిగుతున్నారు. దీనిపై ఇప్పటికే పోలీసులకూ ఫిర్యాదు చేశారు. వారికి లీజు సొమ్ములు చెల్లించేంత వరకు పోరాటం ఆగదని కొల్లేరువాసులతో కలసి చింతమనేని నిరసన గళం విప్పారు. ఈ నేపథ్యంలో చింతమనేని వర్సెస్ అబ్బయ్యచౌదరి మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు చోటు చేసుకుంటున్నాయి. లీజు సొమ్మును ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొల్లేరువాసులు గురువారం కొండలరావుపాలెంలోని అబ్బయ్య చౌదరి ఇంటి వద్దకు వెళ్లే ప్రయత్నం చేశారు. దీనికి ప్రతిగా వైసీపీ కార్యకర్తలు వీరందరినీ ప్రతిఘటించే నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేశాయి. ఈ ఘటనతో మరోసారి అగ్గి రాజుకుంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వారి ప్రవర్తన ఉందంటూ కర్రలు ధరించిన వైసీపీ కార్యకర్తల ఫొటోలతోపాటు ఎస్పీ కిశోర్‌కు లిఖిత పూర్వకంగా ఎమ్మెల్యే చింతమనేని ఫిర్యాదు చేశారు. అబ్బయ్య వ్యవహార శైలిపై ఆది నుంచి చింతమనేని ఆగ్రహంతోనే ఉన్నారు. కొల్లేరువాసులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. శుక్రవారం

• అబ్బయ్యచౌదరి ఇంటిపైకి దాడికి వచ్చారంటూ సమాచారం అందడంతో వైసీపీ తన పార్టీ సీనియర్లను రంగంలోకి దింపింది. మాజీ మంత్రులు పేర్ని నాని, శైలజ నాథ్, జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వర రావు, కన్వీనర్లు బాలరాజు, విజయరాజు, జయప్రకాశ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం కొండలరావుపాలెంలోని అబ్బయ్యచౌదరి నివాసానికి వెళ్లారు. ఆయనను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ చింతమనేని బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని దుయ్య బట్టారు. కేవలం దెందులూరులో అందరినీ భయభ్రాంతులను చేయడమే లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. పోలీసులు నిజాయితీగా వ్యవహరించాల్సింది పోయి టీడీపీ తొత్తులుగా వ్యవహరిస్తే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తేల్చుకుంటామంటూ పేర్ని నాని తీవ్ర స్వరంతో హెచ్చరికలు చేశారు.

మీడియా సమావేశంలో ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏడాకరోజు లండన్ నుంచి ఇక్కడికి (మిగతా 8వ పేజీలో)


మల్లాయపాలెం రైల్వే గేటు నుంచి రాకపోకలు

తెరుచుకున్న మల్లాయపాలెం రైల్వే గేటు

ముదినేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా గుడివాడ - ముదినేపల్లి జాతీయ రహదారిలో ఈ నెల 9 నుంచి మూసివేసిన మల్లాయపాలెం రైల్వే గేటును శుక్రవారం తెరిచారు. 14 రోజులుగా ఈ గేటును రైల్వే అధికారులు మూసివేయడంతో బైక్‌లతో సహా ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను వివిధ రూట్లలో మళ్లించారు. పనులు పూర్తి కావడంతో శుక్రవారం రైల్వే గేటును తెరిచి తొలుత బైక్‌లు, ఆటోలను అనుమతించారు. శనివారం నుంచి అన్ని వాహనాలను అనుమతిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. వాహనాల మళ్లింపు వల్ల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు పెరిగిన చార్జీల భారం తగ్గనుంది.

గన్నవరం రైల్వేగేటు మూసివేత

మండవల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):మండవల్లి మండలం గన్నవరం రైల్వేగేటుకు, ట్రాక్ మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు మూసివేస్తున్నట్లు సెక్షన్ ఇంజనీర్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. ఆరు రోజుల పాటు గేటును పూర్తిగా మూసివేస్తామని, రైతులు. గ్రామస్థులు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని కోరారు.

సైరన్ లేదు.. లైట్లు వెలగవు

» 108 అంబులెన్సు దుస్థితి
» క్షతగాత్రుల తరలింపులో ఆలస్యం
» యువకుడి మృతితో బంధువులు, స్నేహితుల ఆందోళన

ఏలూరు క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆసుపత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడాల్సిన 108 అంబులెన్సు ప్రాణాలు హరించే వాహనంగా మారింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి జిల్లాలో జరిగింది. ఏలూరులోని నాగేంద్ర కాలనీకి చెందిన వెలవెల గోపీకృష్ణ(21) మెడికల్ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. అతను మోటారు సైకిల్‌పై జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరుకు శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వస్తుండగా మార్గమధ్యలో కామవరపుకోట మండలం ఆడమిల్లి వద్ద మరో మోటార్ సైకిస్టు ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో గోపీకృష్ణ, ఢీ కొట్టిన బైక్‌పై ఉన్న యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న వారు 108కు సమాచారం ఇచ్చారు. కామవరపుకోట పీహెచ్‌సీ నుంచి 108 అంబులెన్సు ఘటనా స్థలానికి చేరుకుంది. ఆ వాహనంలో క్షతగాత్రులను ఎక్కించగా రాత్రి 7:30 గంటలకు దాదాపు 40 కిలోమీటర్ల దూరంలోని ఏలూరు ఆస్పత్రికి బయల్దేరింది. అయితే ఆ వాహనానికి సైరన్, హారన్ లేకపోవడం, లైట్లు సరిగా వెలగకపోవడంతో అంబులెన్సు డ్రైవర్ 20 కిలోమీటర్ల వేగం దాటకుండా నడపసాగాడు. దీంతో గోపీకృష్ణ బంధువులు, స్నేహితులు ఎదురు వేగివాడ వరకు వెళ్లారు. మోటారు సైకిళ్ల పై ఉన్న యువకులు పైలెట్లుగా వ్యవహరిస్తూ మోటారు సైకిళ్ల హారన్ కొట్టుకుంటూ ఏలూరు ఆంధ్రా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే గోపీకృష్ణ మరణించాడని వైద్యులు చెప్పారు. మరోవైపు అంబులెన్సులో మరో క్షతగాత్రుడు ఉండడంతో అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. గోపీకృష్ణ స్నేహితులు, బంధువులు రాత్రి 10 గంటల ప్రాంతంలో ఏలూరు (మిగతా 8వ పేజీలో)


అంబులెన్సు వద్ద ఆందోళన చేస్తున్న యువకులు

ఫ్రీ బస్సులతో ఉపాధికి గండి..

ఆటో కార్మికుల ఆందోళన



ఏలూరు కార్పొరేషన్/ ఏలూరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు పథకాన్ని ప్రవేశ పెట్టడంతో తమ ఉపాధికి గండి పడిందని శుక్రవారం ఏలూరు నగరంలోని ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు జె.గోపీ, చక్రాల కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కలుగ చేసుకుని ఆటోడ్రైవర్ల ఉపాధికి చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్వో విశ్వేశ్వరరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఫ్రీ బస్సు పథకం అమలుతో నష్టపోయేది ఆటో డ్రైవర్‌లేనని ప్రభుత్వం గుర్తించకపోవడం బాధ్యతా రాహిత్యమన్నారు. యూనియన్ నాయకులు బొడ్డేపల్లి చంద్రశేఖర్, బి.త్రినాథ్, అడ్డాల రాజు, నల్లమిల్లి నాగరాజు, బాషా, శ్రీనివాస రావు, రాము పాల్గొన్నారు. సీఐటీయూ నగర నాయకులు వై.ఎస్. కనకారావు, ఎం.ఇస్సాకు, పి.రవి మద్దతు పలికారు.


సమస్యలపై వినతిపత్రాలను ఎమ్మెల్యే కామినేని చేతుల మీదుగా మంత్రి ఫరూఖ్‌కు అందజేస్తున్న ముస్లిం పెద్దలు

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూఖ్

కైకలూరు/కలిదిండి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): 'మైనార్టీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం ముస్లింల సంక్షేమాన్ని కాలరాసి ఇబ్బందులకు గురి చేసింది. మైనార్టీ సంక్షేమ బోర్డుకు ఒక్క రూపాయి ఇవ్వలేదు' అని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూఖ్ అన్నారు. కైకలూరు, కలిదిండిలో శుక్రవారం పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కైకలూరు ముస్లింల ఖబరస్తాన్, షాదీఖానాలను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సీతారామఫంక్షన్ హాలులో ముస్లిం మైనార్టీ ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ సంక్షేమ పథకాన్ని అర్హులైన పేద ముస్లింలకు అందించేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి తనవంతు ఎప్పుడూ కృషి చేస్తానన్నారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, జామియా మసీదు మత గురువు ఎండీ ఇల్లావుల్‌హక్, చిన్నమసీదు, పెద్దమసీదు పెద్దలు, టీడీపీ మైనార్టీ నాయకులు, కూటమి మండల పార్టీల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. కాగా కైకలూరులోని న్యాయ స్థానాల అభివృద్ధికి కావాల్సిన నిధులను మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేతో కలిసి మంత్రి పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు. కలిదిండిలో శిథిలావస్థలో ఉన్న షాదీఖానా, ముస్లింల శ్మశాన వాటికను పరిశీలించారు. పెద్ద మసీదు వద్ద నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ షాదిఖానా నిర్మాణానికి శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ కలిదిండిలో ముస్లిం శ్మశాన వాటికను తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తానన్నారు. ఎంపీ నిధులతో ముస్లింలకు కమ్యూనిటీ హాలు భవనం నిర్మించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిట్టూరి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.


కుక్కునూరు తీర ప్రాంతంలో తగ్గుముఖం పట్టిన గోదావరి వరద

గోదావరి తగ్గుముఖం

» అయినా ఊళ్లను వదలని వరద
» కోతకు గురవుతున్న పట్టిసీమ ఫెర్రీరేవు
» బలహీనంగా ఏటిగట్లు

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం వద్ద వరద క్రమేపీ తగ్గుతున్నా గ్రామాలను వరద వీడడం లేదు. ఇప్పటికి వేలేరుపాడు మండలంలో 23 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగి పోగా అత్యవసర పనుల నిమిత్తం ఆయా గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. వరద బాధిత కుటుంబాలకు శుక్రవారం ఐటీడీఏ పీవో రాములు నాయక్ నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేశారు. ఆయా గ్రామాలకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీలో గొమ్ముగూడెం, లచ్చిగూడెం, రేపాకగొమ్ము గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఉండటంతో వారికి జడ్పీ సీఈవో శ్రీహరి చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. కౌండిన్యముక్తి, గ్రామస్థులకు కూరగాయలు పంపిణీ చేశారు. పునరావాస కాలనీలో తాగునీటి సమస్య లేకుండా వాటర్ ట్యాంకులతో తాగునీందిస్తున్నారు. తహసీల్దార్ రమేశ్ బాబు కూరగాయల పంపిణీపై పర్యవేక్షణ చేశారు. పోలవరం వద్ద గోదావరిలో నీటిమట్టం అనూహ్య రీతిలో పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి. కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీటమునిగాయి. వరద జలాల ఉధృతికి పట్టిసీమ ఫెర్రీ రేవు పాత సచివాలయ భవనం వద్ద గట్టు కోతకు గురవుతోంది. పట్టిసీమ రివర్ ఇన్ అతిథి గృహం వద్ద, పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం రేవు వద్ద, గూటాల - తాడిపూడి గ్రామాల మధ్య ఇసుక ర్యాంపు కోసం ఏటిగట్టుకు గండ్లు చేసిన ప్రాంతాలు ప్రమాదకరంగా మారాయి.


పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ గేట్ల వద్ద వరద జలాలు


వేలేరుపాడు సంత మార్కెట్ సెంటర్‌లో ఇళ్లలోకి ప్రవేశించిన గోదావరి వరద


దాచారం పునరావాస కాలనీలో నిర్వాసితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న జడ్పీ సీఈవో శ్రీహరి

25న మెగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

లోపలి పేజీలో..







వినాయక చవితి ఉత్సవాలకు

ముస్తాబైన గణేశ్



ఏలూరు కార్పొరేషన్/పాలకొల్లు అర్బన్/తణుకు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుడు ముస్తాబయ్యాడు. ఉమ్మడి జిల్లాలో పలు పట్టణాల్లో రాజస్థాన్ కళాకారులు పీవోపీ, తాటిపీచు, కొబ్బరిపీచుతో వివిధ ఆకృతులు, రంగుల్లో గణనాథుల విగ్రహాలను తయారుచేశారు. అడుగు ఎత్తు నుంచి 20 అడుగుల విగ్రహాలను గణేశ్ ఉత్సవ నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు. విగ్రహాల ఎత్తును బట్టి రూ.5 వేల నుంచి రూ.70 వేల ధర పలుకుతోంది. రాజస్థాన్ కళాకారులతో పాటు స్థానిక కళాకారులు కూడా గణేశ్ విగ్రహాలు తయారు చేస్తున్నారు. పీవోపీ మాత్రమే కాకుండా మట్టి విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. పాలకొల్లు సమీపంలోని వర్ధనం గ్రామానికి చెందిన ఇంటి ప్రసాద్ లయన్స్ నగర్ ప్రాంతంలో మరో 10 మందితో విగ్రహాలు చేస్తున్నారు. 3 నెలలుగా కొన్ని విగ్రహాలను తయారుచేసి ఉత్సవాలకు సిద్ధం చేశామన్నారు. సుమారు రూ.3లక్షల పెట్టుబడితో 200 గణనాథుల విగ్రహాలను తయారు చేశానని తెలిపారు. మట్టి విగ్రహాలు కూడా కోరితే తయారుచేస్తామని తెలిపారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన రేలంగి సత్యనారాయణ దేవుళ్ల విగ్రహాలతో పాటు జాతీయ నాయకుల విగ్రహాల తయారు చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాలకు పలు సేవా సంస్థలు ఎకో గణపతి పేరుతో మట్టి విగ్రహాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు.







నిబంధనలు పాటించాల్సిందే..

భీమవరం క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకర వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పిలుపునిచ్చారు. మండపాల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలు, భద్రతా అంశాలపై ఎస్పీ సూచనలు చేశారు.

ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

వినాయక ఉత్సవ కమిటీలు మండపాల ఏర్పాటు, ఉత్సవాలకు అనుమతి తీసుకోవడం తప్పనిసరి. గణేశ్ ఉత్సవ.నెట్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్, ఓటీపీ ద్వారా లాగిన్ అయ్యాక, అవసరమైన వివరాలను నింపాలి. దరఖాస్తును పరిశీలించిన తర్వాత పోలీసులు ఒక క్యూఆర్ కోడ్‌ను జారీ చేస్తారు. క్యూఆర్ కోడ్‌ను మండపం వద్ద తప్పకుండా అతికించాలి.

విద్యుత్ జాగ్రత్తలు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ వైరింగ్‌ను నిపుణులతో చేయించాలి.

సౌండ్ సిస్టమ్: లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలి. ఆసుపత్రులు, విద్యా సంస్థలు, మతపరమైన ప్రదేశాల వద్ద మైకులు వాడకూడదు.

నిఘా: మండపాలలో రాత్రిపూట కమిటీ సభ్యులు కాపలా ఉండాలి. మండపాలలో విలువైన వస్తువులను ఉంచకూడదు. శాంతి భద్రతల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

రోడ్డు భద్రత: విగ్రహాలను, మండపాలను రోడ్లపై ఏర్పాటు చేయరాదు. బ్యానర్లు, ఫ్లెక్సీలు ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలిగించకూడదు.

ఊరేగింపు, నిమజ్జనం నిబంధనలు

నినాదాలు, ప్రదర్శనలు: ఊరేగింపు సమయంలో కులలాలు, మతాలు లేదా పార్టీలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే నినాదాలు, అనుచిత ప్రదర్శనలు, అసభ్యకరమైన నృత్యాలు చేయకూడదు. డీజే, బాణసంచాకు అనుమతి లేదు.

వాహనాల నియమాలు: నిమజ్జనం వాహనాలకు లైసెన్స్ ఉన్న డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలి. మద్యం సేవించిన వారు లేదా మైనర్లు వాహనంపై ఉండకూడదు.

నిమజ్జన సమాచారం: నిమజ్జనం మార్గం, సమయం, తేదీ వివరాలను పోలీసులకు తప్పనిసరిగా తెలియజేయాలి. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా కమిటీ సభ్యులు తగినంత మంది వాలంటీర్లను ఏర్పాటు చేయాలి.

భద్రతా ఏర్పాట్లు: నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి.

అవాంఛనీయ సంఘటన జరిగినా, జరగడానికి అవకాశం ఉన్నా వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలి. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటారు.



సత్రంపాడు అంబికా ఆలయంలో వ్రతమాచరిస్తున్న మహిళలు

వరాలివ్వు తల్లీ..

ద్వారకాతిరుమలలో సామూహిక వరలక్ష్మి వ్రతం




ద్వారకాతిరుమలలో అమ్మవారి ఊరేగింపు, పత్తేబాదలో గాజుల అలంకరణ

ద్వారకాతిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీ.. వరాలీయమ్మా అంటూ వ్రత దీక్షల్లో మహిళలు వేడుకున్నారు. చిన్న వెంకన్న ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళలు నిర్వహించారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని అనివేటి మండపంలో దాదాపు 3వేల మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ముందుగా వెండి తొళక్క వాహనంపై వరలక్ష్మీ అమ్మవారిని అర్చకులు, పండితులు వేదమంత్రోచ్చరణల నడుమ అనివేటి మండప వేదిక వద్దకు తెచ్చారు. అలంకరించిన వేదికపై అమ్మవారిని ఉంచి అర్చకులు హారతులు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. వ్రతదీక్ష అనంతరం మహిళలకు అమ్మవారి ప్రసాదంగా పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క, గాజులను పంపిణీ చేశారు. ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళలతో కిటకిటలాడిన ఆలయాలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు విశేష పూజలు, సామూహిక వరలక్ష్మీవ్రతాలు చేశారు. ప్రత్యేక అలంకారంలో అమ్మవార్లు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు, సామూహిక పారాయణతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. సత్రంపాడు సౌభాగ్యలక్ష్మీదేవిని కొల్హాపూర్ మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. పట్టు చీరలతో అంబికాదేవి అమ్మవారిని అలంకరించారు. పత్తేబాదలోని కనకదుర్గమ్మకు లక్ష పంచ రంగుల గాజులు, బావిశెట్టివారి పేట కనకదుర్గాంబ గాజుల గౌరీదేవిగా అలంకరించారు. ఆలయాల మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు నోచుకున్నారు.




ఏలూరులో ప్రత్యేక అలంకరణలో సౌభాగ్యలక్ష్మి, అంబికా దేవి



వెరీ గుడ్డు


ధర పెరగడంతో రైతుకు ఊరట

తణుకు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర పెరగడంతో పౌల్ట్రీ రైతులకు ఊరట కలిగింది. బర్డ్‌ఫ్లూ ప్రభావం తర్వాత గుడ్డ ధర పతనం కాగా ఇటీవల నెమ్మదిగా ధర పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం గుడ్డు ధర రూ.4.95 ఉంది. పది రోజుల క్రితం రూ.4.15 ధర ఉండగా ప్రసుతం రూ4.95 ధరకు చేరింది.

వరుస నష్టాలతో డీలా పడిన పౌల్ట్రీ రైతులకు కాస్త ఉపశమనం కలిగినట్లయింది. వేసవిలో రైతులు చాలా విధాలుగా నష్టపోయారు. ఒక పక్క ఎండ ప్రభావంతో కోళ్ల మృత్యువాత పడ్డాయి. మరో సందర్భంలో కమీషన్ దారులు సిండికేట్ కావడం ద్వారా ధర పెరగకుండా నియంత్రించారు. కమీషన్‌దారుల సిండికేట్‌తో విసిగిపోయిన రైతులు ఏకపక్షంగా గుడ్లు కట్టకుండా నిలిపివేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలా నాలుగు రోజులు రైతులు సమష్టిగా సమస్యలను ఎదుర్కోవడంతో మరలా కమీషన్‌దారులు దిగి వచ్చారు. రైతులతో సయోధ్య కుదరడంతో గుడ్డులను అమ్మకాలు చేశారు. గుడ్డు పరిస్థితులను ఎదుర్కొన్న రైతులకు ప్రస్తుతం గుడ్డు ధర కొంత ఊరటనిచ్చింది.

జిల్లాలో కోటి 5 లక్షల గుడ్ల ఉత్పత్తి

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జిల్లా వ్యాప్తంగా 270 మంది రైతులకు కోటి 30లక్షలు కోళ్ల కెపాసిటీతో పౌల్ట్రీలు ఉన్నాయి. కాగా ప్రస్తుతం కోటి 5 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఉత్పత్తి అయిన వాటిలో 30 శాతం (30లక్షల గుడ్లు) స్థానికం గానే వినియోగం అవుతున్నాయి. మిగిలిన 70 శాతం గుడ్లు ఇతర రాష్ట్రాల కు ఎగుమతి అవుతున్నాయి. ప్రధానంగా పశ్చిమ బెంగాల్, అసోం, బిహార్ రాష్ట్రాలకు ఇక్కడి నుంచి గుడ్లు ఎగుమతి అవుతున్నాయి.



ధర ఆశాజనకం

గుడ్డు ధరలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. నెల రోజుల నుంచి ధరలో తీవ్ర వ్యత్యాసంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కొంతవరకు మంచి ధర లభించడంతో రైతులు ఊపిరి పీల్చుకునే వెసులుబాటు కలిగింది. మరికొన్ని రోజులు ధర ఇలా ఉంటే కాస్త రుణాలు, ఇతర ఖర్చుల నుంచి బయటపడే అవకాశం ఉంది.

- కొమాట్లపల్లి వెంకట సుబ్బారావు, తణుకు

మహో మాయగాడు



అతడు వేదికపై ఉన్నాడంటే మన కళ్లు మనల్ని మోసం చేస్తాయి. నిజమా.. మాయా.. అనే సంభ్రమాశ్చర్యాల్లో ముంచేసే మహా మాయగాడు మన గుగాంపు. కర్ర కదిపితే పూల బొకే ప్రత్యక్షమవుతుంది. ఖాళీ జగ్గు నుంచి నీళ్లు పోస్తాడు. అతడి మ్యాజిక్‌తో రెండు గంటల పాటు మాయ చేసేస్తాడు. ఆచంట మండలం ఎ.వేమవరం గ్రామానికి చెందిన గుడాల గాంధీ పుష్కరుడు గుగాంపు పేరుతో మెజీషియన్‌గా చిరపరిచితుడు. దుబాయ్‌లో స్థిరపడిన గుగాంపు ఇంద్రజాలంలో అనేక అవార్డులు అందుకున్నారు. తాజాగా మ్యాజిక్‌లో అత్యున్నత పురస్కారమైన అమెరికన్ మెర్లిన్ అవార్డు అందుకున్నారు. రెండు సార్లు ఈ అవార్డు అందుకున్నట్లు గర్వంగా చెబుతారు.

మన గుగాంపు

- అంతర్జాతీయ వేదికలపై ఇంద్రజాల ప్రదర్శన
- ప్రతిష్ఠాత్మక అమెరికా మెర్లిన్ అవార్డు కైవసం
- స్వస్థలం ఆచంట వేమవరం
- దుబాయ్‌లో స్థిర నివాసం



ఆచంట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆచంట వేమవరం గ్రామానికి వెళ్లి ఎవరినైనా గుడాల గాంధీ పుష్కరుడి గురించి అడిగితే ఐదు నిమిషాలు ఆలోచిస్తారు. గుగాంపు అని అడిగితే అర క్షణంలో అందరూ చెబుతారు. స్వగ్రామంలోనే కాదు ఎక్కడైనా గుగాంపు పేరు చిరపరిచితం. ఆచంట వేమవరం గ్రామానికి చెందిన అంతర్జాతీయ ఇంద్రజాలికుడు డాక్టర్ గుగాంపు (గుడాల గాంధీ పుష్కరుడు) దుబాయ్‌లో స్థిరపడ్డారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఇంద్రజాల ప్రదర్శనతో ప్రతిభ కనబరిచిన గుగాంపు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఇటీవల అమెరికా లాస్‌వేగాస్‌లో ప్రతిష్ఠాత్మక మెర్లిన్ అవార్డును కైవసం చేసుకున్నారు. అనంతరం ఫోన్ ద్వారా గ్రామస్తులు, బంధువులతో ఆనంద క్షణాలను పంచుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా దేశ విదేశాల నుంచి 37 మంది అంతర్జాతీయ ఇంద్రజాలికులు ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. విశాఖపట్టణానికి చెందిన బీఎస్‌రెడ్డితో పాటు తాను మ్యాజిక్‌లో అత్యున్నత పురస్కారం అమెరికన్ మెర్లిన్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ మెజిషియన్ సొసైటీ చైర్మన్ టోని ఆసీని నుంచి అవార్డును స్వీకరించడం మాటల్లో చెప్పలేనంత అనుభూతి కలిగిందన్నారు. 2016లో మొదటిసారి ఈ అవార్డు తీసుకున్నట్లు తెలిపారు. తాను ఎంచుకున్నరంగంలో అత్యున్నత స్థాయికి ఎదగడంలో ముఖ్యభూమిక పోషించిన మాతృదేశం, స్వగ్రామానికి ఎపుడూ రుణపడి ఉంటానని ఆయన తెలిపారు.

విద్యుత్ వినియోగదారులకు అండ

కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరమ్‌తో సమస్యల పరిష్కారానికి కృషి

ఫోరమ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ



ఎస్‌ఆర్‌పీ అగ్రహారంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఉండి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరమ్ ధ్యేయమని చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. ఉండి మండలం ఎన్‌ఆర్‌పి అగ్రహారం పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో విద్యుత్ వినియోగదారులతో సమావేశం శుక్రవారం జరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి సమస్యలు వచ్చిన తమ ఫోరమ్ దృష్టికి తీసుకుని రావచ్చని తెలిపారు.

టోల్ ఫ్రీ నంబర్ 1912

గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరమ్ టోల్ ఫ్రీ నెంబరు 1912 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. బిల్లింగ్ తప్పుగా నమోదు కావడం, బకాయిలు వసూలు, లోపం ఉన్న మీటరు సమస్యలు, కాలిపోయిన మీటరు, సరఫరాలో అంతరాయం, సరఫరా లోపం, లో ఓల్టేజి, సర్వీసు లోపం, కొత్త కనక్షన్ ఇవ్వడంలో ఆలస్యం తదితర సమస్యలపై నిర్దిష్టంగా తమదృష్టికి తీసుకు రావచ్చని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖపట్నం కేంద్రం పరిధిలో వినియోగదారులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ జిల్లాలో నెలకొకసారి వినియోగదారులకు సమావేశాలు నిర్వహించి సమస్యలను స్వీకరిస్తామని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సత్యనారాయణ వివరించారు. కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరమ్ ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల వినియోగదారుల సమస్యలపై పనిచేస్తామన్నారు. తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సుమారు 8,950 పైగా సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ఉండి మండలం నుంచిపలువురు వినియోగదారులు విద్యుత్ సమస్యలపై వారికి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఫోరమ్ సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎస్‌రాజబాబు, ఎన్ మురళీకృష్ణతో పాటు విద్యుత్ అధికారులు ఎం.వెంకటేశ్వరరావు, ఎం.యూస్ఫీ యు.శ్రీనివాసరావు, ఎ.వెంకటరావు, పి.శ్రీనివాసరావు, సిబ్బంది, బీజేపీ మండల అధ్యక్షుడు విక్రమ్, బ్యాంక్ మాజీ చైర్మన్ శ్రీహరిరాజు, గ్రామ మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, అధిక సంఖ్యలో విద్యుత్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ పోటీల్లో విజయం సాధించిన ఏలూరు బాలికల జట్టు

బాస్కెట్‌బాల్ విజేత ఏలూరు జిల్లా జట్టు

ఏలూరు రూరల్, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమరావతి ఛాంపియన్‌షిప్ కప్ పేరుతో క్రీడా పోటీలను నిర్వహిచింది. కాకినాడలో శుక్రవారం జోన్ 2 లెవెల్ బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయి. పోటీలో ఏలూరు జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఉదయం సెమీఫైనల్స్ పోటీలు జరిగాయి. కోనసీమ జిల్లాతో ఏలూరు జట్టు తలపడింది. 24-59 స్కోర్‌తో ఫైనల్స్‌కు చేరుకుని ఫైనల్స్‌లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై 35-16 స్కోర్‌తో విజేతగా నిలిచింది. ఈనెల 24, 25, 26 తేదీలలో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపికైందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, కె.మురళీకృష్ణ తెలిపారు.

శ్రీవారి సేవలో కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి



స్వామివారి చిత్రపటం ఇస్తున్న డిప్యూటీ ఈవో

ద్వారకాతిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.సుమలత శుక్రవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆమెకు అర్చకులు, దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బంగారు వాకిలి నుంచి లోనికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. అలయ డిప్యూటీ ఈవో భద్రాజీ ఆమెకు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేత

కలెక్టరేట్ వద్ద డయాలసిస్ బాధితుల ఆందోళన

ఉన్నతాధికారులతో మాట్లాడి పునరుద్ధరించిన జేసీ



ఆందోళన చేపట్టిన బాధితులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

భీమవరం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డయాలసిస్ రోగులకు ఎన్టీఆర్ వైద్య సేవ నిలిపివేశారని బాధితులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుమారు 200 మంది డయాలసిస్ పేషెంట్లు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడంతో పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మద్దతు తెలిపారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయికి సమస్య వివరించారు. కొన్ని కారణాల వల్ల ఆ ఆస్పత్రి సేవలు పూర్తిగా నిలిపివేశామని, తణుకు, తాడేపల్లి గూడెం హాస్పిటల్‌కు వెళ్లాలని వైద్యాధికారి సూచించారు. అంతదూరం వెళ్లలే మని బాధితులు జేసీకి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రస్తుతం వైద్య సేవలు పునరుద్ధరించామని, వెంటనే వెళ్లి చికిత్స పొందాలని చెప్పారు. కొత్త పేషెంట్లకు మాత్రం ఆకాశం లేదని చెప్పారు. ప్రస్తుతం ఎవరికీ చికిత్స ఆగదని జేసీ, జిల్లా వైద్యాధి కారి హామీ ఇవ్వడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు.

వైసీపీ పాలనలో డీసీసీబీకి రూ.100 కోట్ల నష్టం : ఆప్కాబ్ చైర్మన్ గన్ని


సొసైటీ చైర్మన్ అప్పన్నను అభినందిస్తున్న గన్ని, వలవల బాబ్జి తదితరులు

పెంటపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ఉన్న డీసీసీబీ గత వైసీపీ పాలనతో రూ.100 కోట్లు నష్టాలలో కూరుకుపోయిందని ఆప్కాబ్, డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు విమర్శించారు. ముదునూరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. సొసైటీ ఛైర్మన్ల సహకారంతో డీసీసీబీని తిరిగి గాడిలో పెడతామన్నారు. భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి త్రిసభ్య కమిటీ కృషి చేయాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ కమిటీ సభ్యులు సొసైటీ ఆదాయాన్ని పెంచేలా కృషి చేయాలన్నారు. సొసైటీ ఛైర్మన్ దాసరి అప్పన్న, సభ్యులు బుద్దన ధనరాజు, బుద్దన నారాయణను శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, బండారు వెంకట్రావు, పుల్లా బాబి, గంధం సతీష్, పాతూరి రాం ప్రసాద్ చౌదరి, దత్తు ప్రసాద్, దాసరి కృష్ణవేణి, బండి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయం పెంచాలి


స్వమిత్వ సర్వే పరిశీలిస్తున్న కృష్ణతేజ

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఆదాయం పెంచేదిశగా సిబ్బంది పనిచేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ అన్నారు. కృష్ణాయపాలెం, పెదతాడేపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. సచివాలయ రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వేపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సర్వేలో ప్రాపర్టీ పోర్టల్ మ్యాప్ దగ్గర ఉంచుకుని సిబ్బంది సర్వే చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు బొలిశెట్టి రాజేష్ కృష్ణతేజకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. డీపీవో ఎస్.రామనాథరెడ్డి, డ్వామా పీడీ అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేశ్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సోమేశ్వరరావు, ఏఈ రాజాశ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు పరిమి వెంకటకృష్ణ, బేదపూడి వెంకటేశ్వర రావు, కార్యదర్శులు వై.హరికిశోర్, టి.రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కలుపు మొక్కలను నియంత్రించాలి


కలుపు నివారణను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కలుపు మొక్క వయ్యారి భామ అత్యంత ప్రమాదకరమని, నియంత్రించాల్సిన అవసరం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఇ.రేఖ అన్నారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషివిజ్ఞాన కేంద్రం వద్ద వారం రోజుల పార్థేనియం(వయ్యారిభామ మొక్కలపై) అవగాహన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. మరో శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవి వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ వయ్యారి 1950న గుర్తించగా 35 మిలియన్ హెక్టార్ల మేర విస్తరించిందన్నారు. ఒక మొక్క 50 వేల విత్తనాలు వెదజల్లుతుందన్నారు. ఈ మొక్కల నివారణకు గ్లైకోసైట్ లేదా మెట్రిబ్యూషన్‌తో అరికట్టవచ్చని వివరించారు.

సాంకేతిక నైపుణ్యంతో సాధికారత


విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సాంకేతిక నైపుణ్యాలతోనే యువత సాధికారత సాధ్యమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబీ వీరేష్ కుమార్ అన్నారు. నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాలలో భాగస్వామ్యంతో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'పోర్ట్ ఇన్సైర్ ఏ కెరీర్ అండ్ కార్పొరేట్ ఫెస్ట్' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. వీరేష్‌కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆధునిక సాంకేతిక రంగంలో సమకాలీన, సృజనాత్మక ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. మెర్సిడెస్ బెంజ్ కంపెనీ సీనియర్ ఇంజనీర్(బెంగళూర్) అయ్యార్ భట్టాచార్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. టి హబ్ డైరెక్టర్ (హైదరాబాద్) అవినాష్ కేదర్, ఫ్యూజీ టెక్ ఉపాధ్యక్షుడు చాణిక్య మాట్లాడుతూ అంకుర పరిశ్రమలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. పి.శంకర్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. తొలిరోజు హ్యాక్‌థాన్ ప్రాజక్టును పరిశీలించారు. కార్యక్రమంలో రేణికుంట్ల విజయ్‌కుమార్, ఆయా కంపని ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పరిశీలనలో జర్నలిస్టుల రైల్వే పాస్‌లు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):జర్నలిస్టులకు రాయితీపై రైల్వే పాస్‌ల సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ తెలిపారు. పార్లమెంట్‌లో ఎంపీ అడిగి ప్రశ్నలకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానాలు ఇచ్చారు. జర్నలిస్టులకు పాస్‌లు ఇచ్చేందుకు పరిశీలిస్తున్నామని మంత్రి జవాబిచ్చారు.

రాష్ట్రంలో ఆరు గ్యాస్, పెట్రోల్ బ్లాకులు గుర్తింపు

రాష్ట్రంలో ఆరు గ్యాస్, పెట్రోల్ బ్లాక్‌లను గుర్తించినట్లు కేంద్రమంత్రి సురేశ్ గోపి ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దేశంలో మొత్తం 54 బ్లాక్‌లు ఉంటే రాష్ట్రంలోనే ఆరు పెట్రోల్, గ్యాస్ బ్లాక్‌లు ఉన్నాయన్నారు. 182.7 మిలియన్ మెట్రిక్‌టన్నుల చమురు గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు.


సమ్మె చేస్తున్న సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు

240 గ్రామాలకు తాగు నీరు బంద్

సత్యసాయి మంచినీటి పథకం కార్మికుల సమ్మె ఎఫెక్ట్

పోలవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):సత్యసాయి మంచినీటి పథకం కార్మికుల సమ్మె ఎఫెక్ట్‌తో 240 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. 11 నెలల జీతాల బకాయి వెంటనే చెల్లించే వరకూ మంచినీటి సరఫరా చేయబోమని శుక్రవారం కన్నాపురం అడ్డరోడ్డు వద్ద సుమారు 110 మంది కార్మికులు సమ్మెకు దిగారు. జీతాల బకాయి వెంటనే చెల్లించాలని, జీవో నెం 11 ప్రకారం జీతాలు విడుదల చేయాలని నినాదాలు చేశారు. గత ఐదేళ్లలో సత్యసాయి కార్మికులు సమ్మెకు దిగడం ఇది రెండోసారి. కార్మికుల సమ్మెతో పోలవరం నుంచి చింతలపూడి వరకూ నాలుగు నియోజక వర్గాల్లో సుమారు 240 గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికుల యూనియన్ అధ్యక్షుడు శివ సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల పాదయాత్రలో విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తమను దత్తత తీసుకుని ఆదుకుంటామని హామీ ఇచ్చారని, హామీ నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారం భాస్కర్, తదితరులు కార్మికులకు సంఘీభావం తెలిపారు.

25న మెగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్



మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ కేటగిరీ పోస్టులకు ఏపీడీఎస్సీ ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఐఎన్ లాగిన్ నుంచి ఇంటిమేషన్ కాపీవచ్చిన అభ్యర్థులు ఆ కాపీని డౌన్‌లోడ్ చేసుకుని, ఈ నెల 25వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం ఏలూరు శివారు వట్లూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు హాజరుకావాలని ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉమ్మడి జిల్లాలో 1074 పోస్టులు
- 23 కౌంటర్లలో ధ్రువపత్రాల పరిశీలన
- 5లోగా నియామకాల పూర్తి
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోనే భారీ వెకెన్సీలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, డీఈడీ, బీపీఈడీ, పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్లతోపాటు, కుల ధ్రువీకరణ, డిజేబుల్డ్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్/రెసిడెన్షియల్ సర్టిఫికెట్, టెట్ మార్కుల కాపీ, డీఎస్సీ హాల్ టికెట్ కాపీ, ఆధార్‌కార్డు, 5 పాస్ పోర్టు సైజు ఫోటోలను తీసుకుని వెరిఫికేషన్‌కు అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. సర్టిఫికెట్లన్నింటినీ అటెస్టేషన్ చేయించి (మూడు సెట్లు), ఒరిజినల్స్‌తో సహా రావాలని కోరారు. అభ్యర్థికి సహాయకులుగా ఒక వ్యక్తిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్‌చేసి అప్లోడ్ చేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో కాల్ లెటర్లు

ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ-2025కి సంబంధించి పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రభుత్వ/జడ్పీ/ఎంపీపీ/మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 1035 ఉపాధ్యాయపోస్టులు భర్తీ చేయనుండగా, వీటిలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 615, ఎస్జీటీ కేడర్‌లో 420 ఉద్యోగాలున్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రం పాఠశాలల్లో 32 పోస్టులు భర్తీచేయనుండగా, వీటిలో స్కూల్ అసిస్టెంట్ కేడర్ 18, ఎస్జీటీ కేడర్ 14 పోస్టులున్నాయి. జువనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహిస్తోన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో 7 పోస్టులను భర్తీచేయనుండగా, వీటిలో 6 ఎస్జీటీ, ఒక పీఈటీ పోస్టు ఉన్నాయి. మొత్తం మీద 1074 పోస్టుల భర్తీకి అభ్యర్థులను 1:1 నిష్పత్తిన ఎంపికచేసి కాల్ లెటర్లను ఆన్‌లైన్‌లో పంపించారు. వీరందరి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 23 కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పరిశీలన కోసం పాఠశాల విద్య డైరెక్టరేట్ నుంచి ఒక జాయింట్ డైరెక్టర్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించనున్నారు. తొలి విడతలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థుల్లో ఎవరైనా అనర్హులుగా తేలితే వారి స్థానంలో తదుపరి మెరిట్‌లో ఉన్న అభ్యర్థిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు. రెండో విడతలోనూ అనర్హులుంటే మూడో విడతలో తదుపరి అభ్యర్థిని పిలిచి తుది ఎంపికలను ఖరారు చేస్తారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన పోస్టులకు జిల్లా విద్యాశాఖ, మిగతా శాఖలకు సంబంధించిన పోస్టుల భర్తీని సంబంధిత శాఖలు పూర్తిచేస్తాయి. కాగా అన్ని శాఖల పోస్టులకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మాత్రం జిల్లా విద్యాశాఖ చేపడుతుంది. మొత్తం మీద సెప్టెంబరు 5న లేదా అంతకంటే కొన్ని రోజులు ముందుగానే కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లిచ్చే అవకాశం ఉంది.

విలీన మండలాలకు టీచర్లు ఫుల్

ఉమ్మడి జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పాఠశాలల్లో టీచర్లు లేకపోవడంతో బోధన సజావుగా సాగడం లేదు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలతోపాటు, కనీస వేతన స్కేలుపై అక్కడ ఈ మండలాల్లో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులందరూ కౌన్సెలింగ్‌లో వేరే మండలాలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో టీచర్ల కోసం ఈ రెండు మండలాల్లో విద్యార్థి, ప్రజాసంఘాలు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు వచ్చాయి. తాజాగా జరుగుతున్న మెగా డీఎస్సీలో నియమితులయ్యే స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలకు 90 శాతం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోనే వెకెన్సీలుంటాయి. కొన్ని వెకెన్సీలు మాత్రం ఉమ్మడి జిల్లాలోని ఇతర మండలాల్లో ఉంటాయి. ఆ ప్రకారం పాఠశాల విద్యాశాఖ కింద భర్తీచేసే మొత్తం 1035 పోస్టుల్లో గవర్నమెంట్/జడ్పీ యాజమాన్యాల కింద నియామకాలు జరిగే మొత్తం 837 ఉపాధ్యాయ ఉద్యోగాల్లో 577 స్కూల్ అసిస్టెంట్ కేడర్, 260 ఎస్జీటీ కేడర్ అభ్యర్థులకు అత్యధిక శాతం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోనే పోస్టింగ్‌లు లభిస్తాయి. ఇవిగాక ఉమ్మడి జిల్లాలోని మున్సిపాల్టీల్లో 153 పోస్టులు, ఏలూరు నగరపాలక సంస్థలో 45 పోస్టులున్నప్పటికీ డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ సమయంలోనే ఆయా యాజమాన్యాలకు అభ్యర్థుల నుంచి అభీష్టాలను తీసుకున్నందున ఇతరులను నియమించే అవకాశం లేదు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తపనా చౌదరి

3న బీజేపీ అధ్యక్షుడు మాధవ్ రాక

విజయవంతం చేయాలని తపన చౌదరి పిలుపు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సారథ్యం యాత్రలో భాగంగా వచ్చే నెల 3న ఏలూరు వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎల్.మాధవ్ పర్యటనను ప్రతి బీజేపీ కార్యకర్త విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి పిలుపునిచ్చారు. ఏలూరులో శుక్రవారం మాధవ్ పర్యటన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాధవ్ తొలిసారి ఏలూరు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 3న ఉదయం చాయ్‌పే ప్రత్యేక కార్యక్రమం, శోభాయాత్ర, అనంతరం సుఖీభవలో నిర్వహించే జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో మాధవ్ పాల్గొంటారన్నారు. బీజేపీ కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబరుగా, సర్పంచ్‌గా, ఎంపీటీసీ, జడ్పీటీసీగా పోటీ చేయడానికి కూటమి తరపున అవకాశం అడగాలంటే మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా కిశోర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబికా కృష్ణ, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, శరణాల మాలతీరాణి, జ్యోతి సుధాకర కృష్ణ, కృష్ణప్రసాద్, అశోక్ చక్రవర్తివర్మ, నూజివీడు ఏఎంజీ చైర్మన్ అరుణ, ఏలూరు ఏఎంసీ వైస్ చైర్మన్ వాణీభాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీ ఉపాధ్యక్షులుగా తపన, నిర్మల

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)


తపన చౌదరి, నిర్మలా కిశోర్, ఆదిలక్ష్మి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో ఏలూరు జిల్లా నేతలకు ప్రాధాన్యత లభించింది. ఇంతకు ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న తపన చౌదరి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న నిర్మలా కిశోర్‌లను తాజా కమిటీలో ఉపాధ్యక్షులుగా నియమించారు. ఏలూరు జిల్లాకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎల్.మాధవ్ కూర్పుచేశారు. తపన చౌదరి గత పార్లమెంటు ఎన్నికల్లో ఏలూరు స్థానాన్ని ఆశించారు. తగ్గట్టుగానే ఆయన నిర్విరామంగా నియోజకవర్గంలో కృషి చేశారు. ఖర్చుకు ఎక్కడా వెనుకాడలేదు. అయితే ఎంపీ స్థానం దక్కలేదు. పొత్తుల నేపథ్యంలో ఏలూరు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి పోటీ చేశారు. అయినా నిరాశ చెందకుండా ఆయన పార్టీ కార్యక్రమాల్లోనే నిమగ్నమవుతూ వచ్చారు. ఉత్తరాంధ్ర పరిశీలకులుగా ఉన్న చౌదరికి ప్రమోషన్ ఇచ్చి ఉపాధ్యక్షులుగా నియమించడంతో పార్టీలో హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటి వరకు మహిళా మోర్చా అధ్యక్షురాలిగా వ్యవహరించిన నిర్మలా కిశోర్‌ను మరో ఉపాధ్యక్షురాలిగా నియమించారు.

రాష్ట్ర కార్యదర్శిగా ఆదిలక్ష్మి

తాడేపల్లిగూడెం: బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా భోగిరెడ్డి ఆదిలక్ష్మి ఎంపికయ్యారు. తాడేపల్లిగూడేనికి ఈమె 1992లో బీజేపీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. 1994లో తాడేపల్లిగూడెం అసెంబ్లీ ఎన్నికలో బీజేపీ తరఫున పోటీ చేశారు. పార్టీలో ఇంకా పలు పదవులు నిర్వహించారు. తనను ఎంపిక చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీ పాకా సత్యనారాయణకు, జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గూడెం నియోజకవర్గం కన్వీనర్‌తాతాజీ, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌లు ఆమెను అభినందించారు.


గూటాల సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఎరువుల కోసం రైతుల ఆందోళన

పోలీసుల రంగ ప్రవేశం

పోలవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలవరం మండలం గూటాల పీఏసీఎస్ వద్ద శుక్రవారం ఎరువుల కోసం రైతులు ఆందోళన నిర్వహించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ గూటాల ఆయకట్టులో 2,500 ఎకరాలు సాగులో ఉన్నాయని సొసైటీలో కేవలం 250 బస్తాలు మాత్రమే స్టాకు ఉందని సిబ్బంది చెబుతున్నారన్నారు. రైతులకు అవసరమైన ఎరువుల పంపిణీ సకాలంలో చేయకపోతే ఖరీఫ్ సాగు కష్టమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయాధికారి ఏమన్నారు..?

మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబును వివరణ కోరగా గూటాల సొసైటీలో 500 లీటర్ల నానో యూరియా, 250 బస్తాల యూరియా నిల్వ ఉందని మొత్తం యూరియా 1,500 ఎకరాలకు సరిపోతుందన్నారు. ఎరువులు ఎవరికి వారు ముందుగా తీసుకోవాలనే ఆతృతలో రైతులు తొందరపడి ఆందోళన చేశారని, యూరియా కోసం ఇండెంట్ పెట్టడం జరిగిందని, రానున్న రెండు రోజుల్లో 50 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులోకి వస్తుందని రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు.

క్రైం సమాచారం

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య


నాగేశ్వరరావు మృతదేహం

కొయ్యలగూడెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): డబ్బుల విషయమై భార్యతో గొడవ పడి పురుగుల మందు తాగిన భర్త చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన పనసకాయల నాగేశ్వరరావు భార్యతో డబ్బుల విషయంలో గొడవ జరగడంతో మనస్తాపంతో ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు అతనిని కొయ్యలగూడెం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోడలిని ఫస్ట్‌ఫ్లోర్ నుంచి కిందికి గెంటిన అత్త

- తీవ్ర గాయాలు.. విజయవాడ ఆసుపత్రికి తరలింపు

ఆకివీడు ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):కోడలిని అపార్ట్‌మెంట్ మొదటి ఫ్లోర్ నుంచి అత్త కిందకు తోచేయడంతో తీవ్రగాయాలైన ఘటన ఆకివీడులో జరిగింది. శుక్రవారం ఆకివీడు కాకరపర్తి చెంచయ్య వీధిలోని అపార్ట్‌మెంట్ ఫస్ట్ ఫ్లోర్‌లో వేంపాడు భానుమూర్తి, సుబ్బలక్ష్మి ఉంటారు. స్థానికులు తెలిపిన వివరాలివి.. కొడుకు, కోడలు తమిళనాడు రాయ్‌వెల్లూరులో ఉంటారు. ఇటీవల సుబ్బలక్ష్మి రాయ్‌వెల్లూరు వెళ్లి వచ్చే సమయంలో పూజల నిమిత్తం కోడలు హేమ సింధూజను ఆకివీడు తీసుకొచ్చింది. సుమారు రెండు నెలలు నుంచి ప్రతిరోజు కోడలిని అత్త చిత్రహింసలకు గురిచేస్తుంది. ఈనేపథ్యంలో శుక్రవారం కోడలు సింధూజను అత్త సుబ్బలక్ష్మి అపార్ట్‌మెంట్ ఫస్ట్‌ఫ్లోర్ నుంచి కిందకు తోచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. తొలుత స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించినట్లు స్థానికులు తెలిపారు. కోడలి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి అత్త, మామను స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.

ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ.. కేసు నమోదు

టి.నరసాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ జయబాబు తెలిపారు. రాజుపోతేపల్లి తిరుమలదేవిపేట గ్రామ శివారులో ఈనెల 21న రైతుల వ్యవసాయ భూముల్లో గల ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి వాటిలోని కాపర్‌వైరు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై ఏఈ దాసరి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సారా కలిగి ఉన్న వ్యక్తిపై కేసు

టి.నరసాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):అక్రమంగా నాటు సారా కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టి.నరసాపురం మండలం బంధంచర్లలో శుక్రవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించగా నత్తా కల్యాణ్‌కు చెందిన 50 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి అతడి వద్ద నుంచి ఒక లీటర్ సారా స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు శివారు ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేసి ఒక ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పెదపాడు ఎస్ఐ కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహనంతో పాటుగా వాహనంలోని చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాకు యువత సహకరించాలి

- ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు


సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు.. సదస్సులో విద్యార్థినులు

ఏలూరు క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు యువత సహకరించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు విద్యార్థులకు సూచించారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కిశోర్ ఏలూరు సీఆర్‌రెడ్డి కాలేజీలో శుక్రవారం సాయంత్రం ఏలూరు త్రీటౌన్ సీఐ వి. కోటేశ్వర రావు, జిల్లా శక్తి టీమ్‌లు కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాలు శారీరక మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతిని చదువులలో వెనుకబడి వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. వారిపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు అడియాసలు అవుతాయన్నారు. ఒక విద్యార్థి డ్రగ్స్‌కు అలవాటు పడినట్టు ముందుగా అతడి స్నేహితులకు తెలుస్తుందని వెంటనే వారు కాలేజీ యాజమాన్యానికి కాని, పోలీసులకు గాని తెలియజేస్తే వారికి డ్రగ్స్‌కు దూరంగా ఉండేటట్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నా రు. డ్రగ్స్‌కు బానిసలైన వారిని గుర్తించి డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించి వాటిని మాన్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మత్తుపదార్థాలు వ్యాపారం చేస్తున్నా, వినియోగిస్తున్న వారి సమాచారం 1972కు గాని, 112గాని తెలియజేయాలని సూచించారు.

ఈఎంఐ కట్టమంటే కొట్టేశారు..?

- ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో కలెక్షన్ స్కాం
- కస్టమర్ల సొమ్ము జమ చేయకుండా మేనేజర్ స్వాహా..!
- ప్రాథమిక విచారణలో 26 మంది సొమ్ము గల్లంతు


ఫైనాన్స్ సిబ్బందిని నిలదీస్తున్న బాధితులు

నరసాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్తూట్ ఫిన్‌కార్ప్ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ల స్కాం శుక్రవారం వెలుగు చూసింది. ఆస్తుల తాకట్టు పెట్టి రుణం తీసుకున్న కస్టమర్ల సొమ్మును ప్రతి నెల సంస్థకు జమ చేయకుండా మేనేజర్ వినోద్ స్వాహా చేశాడు. అప్పు తీసుకున్న కస్టమర్ల సొమ్ములు బకాయిలు ఉండడంతో ప్రధాన కార్యాలయం నుంచి నోటీసులు అందాయి. దీంతో వారు కార్యాలయానికి వెళ్లి మేనేజర్‌ను నిలదీశారు. మొత్తం ఈ వ్యవహారం బయటపడింది. సంస్థ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదుచేశారు. ముత్తూట్ కేంద్ర కార్యాలయం నుంచి ఆర్‌ఎం స్థాయి అధికారి నాగరాజు వచ్చి విచారణ చేశారు. ప్రాథమిక దర్యాప్తులో 26 మంది కస్టమర్ల సొమ్ము సుమారు రూ.8 లక్షలను మేనేజర్ సంస్థకు జమ చేయలేదని తేలిందన్నారు. ఇంకా లోతైనా విచారణ చేస్తున్నామన్నారు. నివేదికను కేంద్ర కార్యాలయానికి అందించి వారి సూచనల ప్రకారం మేనేజర్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కస్టమర్లకు ఏం చేయాలన్న దానిపై ఆలోచిస్తామన్నారు. ఈ విషయం బయటకు గుప్పుమనడంతో ఈ సంస్థలో అస్తులు పెట్టి రుణాలు తీసుకున్న కస్టమర్లు ఆందోళన చెందుతున్నారు.

ఏలూరు జిల్లాలో వాహనాల తనిఖీలు


ఏలూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న ఏలూరు త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదార్లపై పోలీసులు సాయంత్రం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. అక్రమ మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ఆకస్మికంగా తనిఖీలను చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రజలకు రోడ్డు ప్రమాద నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సరిగా లేనివారికి, డ్రైవింగ్ లైసెన్సు లేనివారికి ఈ-చలానాలు విధించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేవారికి కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. ప్రతి వాహనానికి అవసరమైన రికార్డులతోపాటు ఇన్సూరెన్స్ కచ్చితంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్ ప్రమాదకరమన్నారు. వర్షాల నేపథ్యంలో రోడ్లు జారే అవకాశం ఉన్న దృష్ట్యా అతి వేగం ప్రమాదకరమని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.

అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు

ఏలూరుఅర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలో పలు అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలె(యూపీహెచ్‌సీ) భవన నిర్మాణాలకు 15వ ఆర్థికసంఘం గ్రాంటు నుంచి నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులను శుక్రవారం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు జారీ చేశారు. ఒక్కో యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.కోటి చొప్పున కేటాయించారు. ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం హరిజన పేట-1, చింతలపూడి, ఏలూరులో శనివారపు పేట-1, వెంకటాపురం-1, సత్రంపాడు-1 యూపీహెచ్‌సీలు, పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు కొమ్మయ్య చెరువుగట్టు యూపీహెచ్‌సీలకు నిధులు మంజూరు చేశారు.


108 వాహనంలో ప్రసవించిన బిడ్డ

అంబులెన్స్‌లో ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం

మొగల్తూరు. ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడి గ్రామానికి చెందిన దుర్గాభవానీ 108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. శుక్రవారం ఆమెకు పురుటి నొప్పులు రావడంతో ప్రసవం కోసం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యలో అంబులెన్స్‌ను ఆపి టెక్నీషియన్ సుధీర్‌కుమార్ సపర్యలు చేస్తుండగా మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

'రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి'

భీమడోలు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సహకార సంఘ సొసైటీల్లో రైతులు బ్యాంక్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే రుణం మంజూరు చేయాలని ఆప్కాబ్ ఛైర్మన్, భీమడోలు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు సొసైటీ బోర్డు సమావేశం గన్ని అధ్యక్షతన శుక్రవారం జరిగింది. త్వరలో బ్యాంక్ పరిధిలో బంగారం కుదవపై రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా నేస్తం రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను ఆమోదించారు. డీసీసీబీ సీఈవోలు సింహాచలం, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు వ్యతిరేక చట్టాలు, శిక్షలపై అవగాహన

ఏలూరు అర్బన్,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది విజయభాస్కర్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాలు, శిక్షలను వివరించారు. సీనియర్లు, జూనియర్ల మధ్య ఆరోగ్యకరమైన, ప్రేమపూర్వకమైన సంబంధాలుండాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, యాంటీ ర్యాగింగ్ కమిటీ ఇన్‌చార్జి డాక్టర్ రత్నమేరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ జోస్పిన్ పాల్గొన్నారు.

'మూల్యాంకనకు పుస్తకాల విధానం వద్దు'


డీఈవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పరీక్షల నిర్వహణలో భాగంగా మూల్యాంకనకు పుస్తకాలను ప్రవేశపెట్టడం వల్ల జవాబు పత్రాలను (పుస్తకాలను) దిద్దేపద్ధతిలో టీచర్లకు పలు సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం డీఈవో వెంకట లక్ష్మమ్మకు ఏపీటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటివరకు అమల్లోవున్న విధానం ప్రకారం జవాబుపత్రాలను ఇంటివద్ద దిద్దేపద్ధతి ఉండేదని, కొత్తవిధానంలో వందలాది మూల్యాంకన పుస్తకాలను స్కూలునుంచి ఇంటివద్దకు మోసుకెళ్లలేని పరిస్థితి నెలకొందని డీఈవోకు వివరించారు. పాఠశాలలో మూల్యాంకనం చేయడంవల్ల బోధనా సమయం వృథాఅవుతోందని పేర్కొన్నారు. మార్కుల నమోదు టీచర్లకు పనిభారంగా ఉందన్నారు. డీఈవోను కలిసినవారిలో సంఘ నాయకులు కొండయ్య కుమార్, పరమానందం, శ్రీనివాస్, దొరబాబు, సుబ్రహ్మణ్యం, తదితరులున్నారు.


పెదకడిమిలో డ్రోన్‌ను పంపిణీ చేస్తున్న అధికారులు

పెదకడిమిలో సబ్సిడీపై డ్రోన్ల పంపిణీ

దెందులూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై డ్రోన్‌లను అందిస్తుందని పెదవేగి మండల వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాస్, ఎల్‌డీ ఎండీ నీలాద్రి అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం పెదకడిమిలో సబ్సిడీపై డ్రోన్లను గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీదేవి, బాలకృష్ణతో కలిసి రైతులకు డ్రోన్లను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, సర్పంచ్ కోనరాజు బలరామకృష్ణతో కలిసి రైతులకు పలు పథకాలపై అవగాహన కల్పించారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు

త్వరలో జర్నలిస్టులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు


ద్వారకాతిరుమలలో జేశాప్ నూతన కార్యవర్గం

ద్వారకాతిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు త్వరలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ (జేశాప్) సంఘ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి పి.రవికుమార్ అన్నారు. ద్వారకాతిరుమలలో శుక్రవారం జేశాప్ జిల్లా మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు తరచూ పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంస్థ ఉపాధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణంరాజు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా జేశాప్ జర్నలిస్టుల రిక్రియేషన్ కోసం పనిచేస్తోందని ఉమ్మడి జిల్లాల్లో సైతం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడలు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జేశాప్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జేశాప్ అధ్యక్షుడిగా బీవీ తారకరామారావు, ప్రధాన కార్యదర్శిగా బొండాడ నాగబాబు, కోశాధికారిగా కమ్మ నాగేంద్రకుమార్‌లను ఎన్నుకున్నారు. నేతలు మొడియం ప్రసాద్, సునీల్, రాంబాబు, ధనుంజయ పాల్గొన్నారు.

సైరన్ లేదు.. లైట్లు వెలగవు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వాసుపత్రికి చేరుకుని అక్కడే ఉన్న అంబులెన్సు వద్ద ఆందోళన చేపట్టారు. కండీషన్ లేని అంబులెన్సులను ఎలా పంపిస్తారంటూ అంబులెన్సు సరైంది లేకపోవడం వల్ల గోపీకృష్ణ ప్రాణాలు కోల్పోయాడని అంబులెన్సు డ్రైవర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన బండితోనే విధులను నిర్వర్తిస్తు న్నామని అది బ్యాకప్ వెహికల్ అని అసలైన వాహనం రిపేర్‌లో ఉందని చెప్పుకొచ్చారు. ఇలాంటి వాహనాలను రోడ్డెక్కించి ఎవరి ప్రాణాలు తీస్తారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ పోలీసులు ఏలూరు ప్రభుత్వా సు పత్రికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లా డారు. ఏదైనా సమస్య ఉంటే ఫిర్యాదు చేయా లని సూచించారు. అయితే రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉండి ఆందోళన కొనసాగించారు.

లీజు మంటలు

(5వ పేజీ తరువాయి)

రావడం, ఉన్న నాలుగు రోజులు మీడియాలో ప్రచారం కోసం అనవసర గొడవలు సృష్టిస్తూ ఆకతాయితనంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. సంవత్సరానికి మూడుసార్లు చుట్టపుచూపుగా వచ్చే మీకు అసలు స్థానిక సమస్యల మీద మాట్లాడే అర్హత ఉందా.. అంటూ ప్రశ్నించారు. రేపు మళ్ళీ బ్యాగు సర్దుకుని పోతావు, ఈ నాలుగు రోజులు నీకు మీడియా కవరేజి కావాలని హడావుడి సృష్టించిపోతావంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏదో నష్టం జరిగిపోయినట్టు పరామర్శలా.. అంటూ కొండలరావుపాలెం వచ్చిన వైసీపీ నేతలను ఉద్దేశించి ప్రభాకర్ ప్రశ్నలు కురిపించారు. కొల్లేరువాసులకు వీలైతే న్యాయం చేయండి. ఇక్కడ జరుగుతుందేమిటో మీకు తెలుసా. మీ మాజీ ఎమ్మెల్యే ఏమీ తెలియనివాడిగా నటిస్తూనే అరాచకాలకు బీజాలు వేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులకు పింఛన్లు తొలగిస్తే, వాటిని స్థానిక వైద్యులు ధ్రువీకరిస్తే నా మీద నిందలు వేస్తారా. నాకు ఏం సంబంధమంటూ ప్రశ్నించారు. వీధి రౌడీలు, బౌన్సర్లకు డబ్బు ఎరచూపి గ్రామాల్లో శాంతిభద్రతలకు అబ్బయ్యచౌదరి విఘాతం కలిగిస్తున్నారంటూ ఆరోపణలు గుప్పించారు.

ఆరోపణలు తగవు : డీఎస్పీ

నూజివీడు: పోలీసులు నిష్పాక్షికంగా విధులు నిర్వహించినప్పటికీ వైసీపీ నాయకులు అబ్బయ్య చౌదరి, పేర్ని నాని అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సహించమని నూజివీడు డీఎస్పీ ప్రసాద్ అన్నారు. నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ అనుమతులు తీసుకోకుండా కొండలరావుపాలెం కార్యకర్తలతో సమావేశానికి పిలుపునిచ్చారన్నారు. దీంతో ఆయన ఇంటికి భారీగా కార్యకర్తలు హాజరయ్యారని, ప్రణాళిక ప్రకారం అబ్బయ్య చౌదరి కొంత మంది రౌడీషీటర్లును, బౌన్సర్లను ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇది తెలుసుకున్న కొల్లేరు గ్రామస్థులు, వీరికి మద్దతుగా ఉన్న కొంత మంది టీడీపీ కార్యకర్తలు కొండలరావుపాలెం వచ్చారని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిందన్నారు. ఇరు వర్గాలు పోగైన తరువాత బౌన్సర్లు, రౌడీషీటర్లు కొల్లేరు రైతులపై తిరగబడ్డారని, దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగిందని వారిని ఆపడానికి ప్రయత్నించిన పోలీసులపై కూడా తిరగబడ్డారన్నారు. అయినా పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారన్నారు. ఈ క్రమంలో కొందరు టీడీపీ శ్రేణులు కూడా పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఇది గుర్తించి పోలీస్ విధులకు అడ్డంకి కల్పించారనే కారణంతో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పటి వరకు బౌన్సర్ల వేషంలో వచ్చిన 9 మందిని గుర్తించామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తాము ఎవరి తరపునా వకాల్తా పుచ్చుకోకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ తాము చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం పోలీస్‌లపై అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. వీరి ప్రవర్తనలో మార్పు రాకుంటే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు కాలువపై బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం


దాతలతో ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు నియోజకవర్గంలో ఉంగుటూరు, నారాయణపురం, పూళ్ల గ్రామాల్లో ఏలూరు కాలువపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిల నిర్మాణాలకు శ్రీకారం చుడతామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలను గ్రామంలో ఏలూరు కాలువపై బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావడంతో నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన గ్రామస్థుల్ని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ఆధ్వర్యంలో ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ చొరవతో దాతల ఔదార్యంతో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావడం సంతోషకరమన్నారు. జనసేన నాయకులు వట్టి పవన్, ఏలూరు ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో పాల్గొని అభిమానులను అభినందించారు.

పేదలకు భరోసాగా 'సీఎం సహాయనిధి'


సీఎం సహాయనిధి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అనారోగ్యపాలైన పేదలకు సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శుక్రవారం ఏలూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసీలను ఆయన అందజేసి మాట్లాడారు. 15వ డివిజన్‌కు చెందిన కె.పోసమ్మ ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతూ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతుందన్నారు. కుటుంబసభ్యుల విజ్ఞప్తి మేరకు రూ.రెండున్నర లక్షల ఎల్‌వోసీ అందజేశామన్నారు. గత ఏడాది కాలంగా సీఎం సహాయనిధి ద్వారా నియోజకవర్గంలో రూ.2 కోట్ల విలువ గల వైద్యాన్ని ఉచితంగా అందజేశామన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

నానో యూరియాతో అధిక ప్రయోజనాలు

ఏలూరు రూరల్,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియా వాడకంతో అధిక ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో శుక్రవారం నానో యూరియాపై రైతులకు శిక్షణనిచ్చారు. ఏవో డి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియాతో పర్యావరణ, నేల కాలుష్యాలను తగ్గించవచ్చని, అధిక దిగుబడి సాధించవచ్చు న్నారు. బస్తా యూరియాలో ఉండే పోషకాలు అర లీటర్ నానోలో ఉంటాయన్నారు. రైతులకు రవాణా ఖర్చులు కలిసొస్తాయన్నారు. ఏడీఏ అనిలకుమారి, తహసీల్దార్ విజయకుమార్‌రాజు, చాటపర్రు సొసైటీ ఛైర్మన్ శ్రీనాథ్‌చౌదరి, ఇఫ్కో ప్రతినిధులు నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

'వీఆర్వోలపై ఒత్తిడి సరికాదు'

ఏలూరు రూరల్, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి) : సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు విషయంలో వీఆర్వోలపై అధికారుల ఒత్తిడి చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో 2024 ఎన్నికల ముందు ఇదే సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో వీఆర్వోలపై ఒత్తిడి చేయడం జరిగిందన్నారు. అప్పట్లో తాము వ్యతిరేకించినట్టు తెలిపారు. అదే విధానాన్ని ఇప్పుడు కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఎవరికైనా కుల సర్టిఫికెట్ కావాలనుకుంటే నేరుగా ఆధారాలతో సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారందరికీ సర్టిఫికెట్లు వెంటనే అందిస్తారని, అటువంటిది తప్పుడు సమాచారం వీఆర్వో లాగిన్‌లకు పంపించి మీరు ఏం చేస్తారో తెలియదు వెంటనే పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూరల్ ప్రాంతాల్లో ఎంతోకొంత సమాచారం సేకరిస్తున్నారని, అర్బన్ ప్రాంతాల్లో సమాచారం కూడా దొరకడం చాలా ఇబ్బందికరమైన పరిస్థితి తలెత్తుతుందన్నారు.

పారదర్శకంగా ఎరువుల పంపిణీకి చర్యలు

పెదపాడు,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీకి అందే యూరియా నిల్వలను పూర్తిస్థాయి పారదర్శకంగా రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పెదపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ గారపాటి స్టాలిన్ తెలిపారు. ఇప్పటివరకు 135 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలను రైతులకు అందించగా, మరో 80 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి మిగతా రైతులకు యూరియా అందించేలా చర్యలు చేపడుతున్నట్టు పెదపాడు డీసీ అధ్యక్షుడు బొప్పూడి కాశీబాబు తెలిపారు. పెదపాడు సొసైటీలో యూరియా పంపిణీని సీఈవో డీవీ సుబ్బారావుతో కలిసి శుక్రవారం పర్యవేక్షించారు. కార్యక్రమంలో సొసైటీ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాతూరి నాగభూషణం జయంతి

పెదపాడు,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య సమరయోధులు, గ్రంథాలయ ఉద్యమ నాయకుడు పాతూరి నాగభూషణం 118వ జయంతి కార్యక్రమం పెదపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. పాఠశాల హెచ్.ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు, వయోజన విద్యావ్యాప్తికి కృషి చేసిన త్యాగధనుడు, స్వాతంత్ర్య సమరయోధుడు నాగభూషణం అన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

బుట్టాయగూడెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్, పొలిటికల్ సైన్స్ గెస్ట్ అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు పీయూవీఎన్ మహేంద్రరావు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసు కోవాలని ఈనెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం నిర్ణయించిన గౌరవ వేతనం అందిస్తామని, వివరాలకు 94909 18788 నంబరులో సంప్రదించాలన్నారు.


కాగడాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాగడాలతో కాంగ్రెస్ నాయకుల ప్రదర్శన

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఓట్ల దొంగతనాన్ని నిరశిస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రగళ్ళపాటి కాశీ ఆధ్వర్యంలో స్థానిక బోసుబొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్రబాబు మాట్లాడుతూ లక్షలాది ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యంపై ఘోరదాడి అని అన్నారు. అప్‌ల్యాండ్ ఏరియా కాంగ్రెస్ ఇన్‌చార్జి మద్దాల ప్రసాద్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీజేపీ దొంగ ఓట్లను చేర్చి ప్రత్యర్థి పార్టీ ఓట్లను తొలగించి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా పోరాడుతున్న రాహుల్‌గాంధీకి ప్రజలంతా ఐక్యంగా కలిసి రావాలని డీసీసీ ఉపాధ్యక్షుడు కూనపో రాజారత్నం అన్నారు. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొద్దువాసు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి రామసూరి రెడ్డి, దారం సత్తిరాజు, కొప్పుల బాలకృష్ణ, బోయిన వెంకన్న పాల్గొన్నారు.


కొయ్యలగూడెం, జీలుగుమిల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

ఏలూరురూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఏలూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి యువత ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు నారా శేషు పాల్గొన్నారు. ఏలూరు చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు శానం శ్రీరామకృష్ణ, మారం హనుమంతరావు, సురేశ్ మాస్టర్, పవన్, నవీన్‌కుమార్, వాసు, పెదబాబు, నరేశ్, జనసేన నాయకులు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

●కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం/జీలుగుమిల్లి/ఏలూరు: సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు కొయ్య లగూడెంలో శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. స్థానిక గణపతి సెంటర్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. జనసేన మండల అధ్యక్షు డు తోట రవి, జనసేన నాయకులు తాడికొండ మురళీకృష్ణ, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మాదేపల్లి శ్రీను, నక్కా బాబి, మేకల తేజ, ఏపూడి సతీశ్, సంకు మధు, మట్టా శ్రీను, మధుబాబు, టీడీపీ నాయకులు గంగిరెడ్ల మేఘలాదేవి, మంచాల వెంకయ్యనాయుడు, ఉపసర్పంచ్ సంకు కొండ, ముప్పిడి చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెంలో చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హెడ్ పోస్టాఫీసు వద్ద మమత ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పదోవార్డు కౌన్సిలర్ తెలగారపు జ్యోతి ప్రారంభించారు. కూటమి నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కరాటం ఉమామహేశ్వరరావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, టీడీపీ నాయకులు దాసరి శ్యామ్‌చంద్రశేషు, పెనుమర్తి రామకుమార్, రావూరి కృష్ణగుమ్మడి ప్రసాద్, కౌన్సిలర్ కె.రమాదేవి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షు రాలు పీసుపాటి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లిలో జనసేన మండల పార్టీ, జగదాంబ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో చిరు జన్మదినవేడుకలు ఘనంగా నిర్వహించారు. జీఆర్‌కే గార్డెన్స్ వద్ద జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ కేక్ కట్ చేశారు. జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, కోలా మధు, దేవుడు శ్రీను, నేదునూరి లక్ష్మీపతి, ధ్రువకుమార్ ఉన్నారు.

● లింగపాలెం మండలంలో చిరంజీవి అభిమానులు, నాయకులు కేక్‌ను కట్‌చేసి స్వీట్‌లు పంపిణీ చేశారు.

'వారపు సంతలో మాంసం దుకాణాలు తొలగించాలి'


మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో భాగంగా స్థానిక వారపు సంత పక్కనే ఉన్న అక్కమ్మ కోనేరును సుమారు రూ.రెండు కోట్లతో అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో వారపుసంతలో చేపలు, మాంసపు దుకాణాలను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గంగానమ్మ గుడి నుంచి విశ్వహిందూ పరిషత్,బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి, ధర్నా నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ కేవీ రమణకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ సీనియర్ నాయకుడు మల్లాది సీతారామారావు మాట్లాడుతూ మునిసిపల్ అధికారులు మార్కెట్‌లో పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలన్నారు. బీజేపీ నాయకుడు అర్జుల మురళీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు కేవీఆర్.సత్యనారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు తాటికొండ సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రామలక్ష్మి, కొప్పాక శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ కొంచాడ దుర్గాప్రసాద్, సునీల్ దత్, సొలస రవికుమార్, కొనకళ్ళ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో లైన్‌మన్‌ల పాత్ర కీలకం : ఎస్ఈ


సేఫ్టీకిట్స్ అందిస్తున్న ఎస్ఈ సాల్మన్‌రాజు

ఏలూరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు అందించే విద్యుత్ సరఫరాలో లైన్‌మన్‌ల పాత్ర కీలకమని ఎస్ఈ సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో విధి నిర్వహణలో ప్రమాదాలకు గురికాకుండా అవసరమైన భద్రతా పరికరాలను ఏపీఈపీడీసీఎల్ దాతల సహకారంతో సేఫ్టీ కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు రాత్రి, పగలు తేడా లేకుండా సాహసంతో విధులు నిర్వర్తిస్తారన్నారు. ఆ సమయాల్లో సేఫ్టీని మరచిపోకూడదన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ సర్కిల్ డీఈ కేఎం.అంబేడ్కర్, దాతలు ప్రముఖ సీడ్స్ అధినేతలు, పెదబాబు, కేవీఆర్ మాణిక్యాలరావు, అసోసియేషన్ నాయకులు తురగా రామకృష్ణ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల స్థలాలు లేని గ్రామీణ ప్రాంత పేదలకు మూడు సెంట్ల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పంగిడిగూడెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ పంగిడిగూడెంలో తొంభై కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేక అద్దె ఇళ్లల్లో రెండు, మూడు కుటుంబాలు ఒకే ఇంటిలో నివశిస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.అశోక్ కుమార్, కె.సుబ్బారావు, గుదే బాలయ్య, పెండెం బజారు, పి.ఘటోత్కచుడు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు సరిచేయండి..


బట్రాజులకాలనీ డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగు

కామవరపుకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు గ్రామంలోని బట్రాజుల కాలనీలో రోడ్డుకు ఇరువైపులా గల డ్రెయిన్లు సజావుగా లేకపోవడంతో నివాసాల్లో ఉండలేక పోతున్నామని ఆ కాలనీవాసులు గగ్గోలు చేస్తున్నారు. ఈ డ్రెయినేజీల్లో మురుగునీటి పారుదలకు అవకాశం లేక మురుగు స్తంభించిపోతుంది. డిస్పోజల్స్, వ్యర్థాలు అధికంగా ఉండడంతో దోమలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ వారు తక్షణమే రోడ్డుకు ఇరువైపులా గల డ్రెయిన్లను సరిచేయాలని, పూడికలు తొలగించాలని, మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఏలూరు అర్బన్,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): 'డిజిటల్ అరెస్టులు-సైబర్‌నేరాలు' అనే అంశంపై శుక్రవారం స్థానిక సీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు అతిథి ఉపన్యాసమిచ్చారు. విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు పాల్గొన్నారు.

రుతు రుమాళ్ల పంపిణీ

ఉంగుటూరు,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : బాలికలు యుక్తవయస్సులో నెలసరి సమయంలో వారు పడే ఇబ్బందుల దృష్ట్యా తమ సంస్థ విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహనపాటు రుతు రుమాళ్లు అందిస్తున్నామని ఆమెన్ సంస్థ డైరెక్టర్ ఇవాంజిలిన్ అన్నారు. శుక్రవారం బొమ్మిడి, ఉంగుటూరు బాలికల వసతి గృహాల్లో 90 మంది బాలికలకు రుతు రుమాళ్లు అందించారు. వసతి గృహ సంక్షేమ అధికారిణి మాధవి, బాల మేడం, కాగుపాడు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎంసీ స్కూల్లో కలర్స్ డే

దెందులూరు,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి పిల్లల్లో కలర్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పెదవేగి ఎస్ఎంసీ నర్సరీ స్కూల్ ఛైర్మన్ రెవ ఫాదర్ డాక్టర్ చుక్కా డొమినిక్ అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం కూచింపూడి సమీపంలో ఉన్న ఎస్ఎంసీ స్కూల్‌లో కలర్స్ డే వేడుకలను స్కూల్ ప్రిన్సిపాల్ చుక్కా అవినాశ్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూకే దేశాల నుంచి వచ్చిన విదేశీయులు చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను వారు తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టైలు, షూలు, పెన్నులు, పుస్తకాలను అందజేశారు.

తల్లాపురంలో 'ఫ్రైడే డ్రైడే'

ఉంగుటూరు,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మలేరియా యూనిట్ అధికారి పి.ఎస్.ఎస్.ప్రసాద్ శుక్రవారం తల్లాపురం గ్రామాన్ని సందర్శించి గ్రామంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. నివాసిత ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ కాంతారావు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రావులపర్రులో ఆక్రమణలపై ఫిర్యాదు

ఉంగుటూరు,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రావులపర్రు గ్రామంలో ఆక్రమణలపై స్థానిక ఎంపీడీవో రాజ్‌మనోజ్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గాది రమణ బీసీ కాలనీలో రహదారి ఆక్రమించి మెట్లు నిర్మించారన్నారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంచినీటి చెర్వులోకి ఆనుకుని ఉన్న చెరువు పోరంబోకు నుంచి మురుగు నీరు వెళ్లకుండా గాది సూర్యనారాయణ డ్రెయినేజీని పూర్తిగా ఆక్రమించుకుని దానిపై ఇల్లు నిర్మించుకుంటున్నార న్నారు. వీటికి సంబంధించి సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

బుట్టాయగూడెం,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం సబ్ స్టేషన్‌కు వచ్చే 33 కేవీ లైన్‌కు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నామన్నారు. రామారావుపేట సెంటరులోని ఎస్ఎస్ పరి ధిలో ఏజీఎల్ త్రీఫేస్ సప్లై ఉదయం నుంచి 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నామన్నారు.

నూజివీడు డీవైఈవోగా సుధాకర్

నూజివీడు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు డీవైఈవోగా పాటిబండ సుధాకర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు డీవైఈవోగా బాధ్యతలు నిర్వర్తించిన సేవియా రెండు నెలల క్రితం పదవీ విరమణ చేయగా, నాటి నుంచి ఈ పోస్ట్ ఖాళీగానే ఉంది. ఈ నేపథ్యంలో సుధాకర్‌ను నియమిస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్‌జోన్ వ్యాయామ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శనివారం పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలోగల గోనెపాడు ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఆ శాఖ డీఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కైకలూరు మండలంలోని పల్లెవాడ, భుజబలపట్నం, చటాకాయ్, నత్తగుల్లపాడు గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల్లోని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులందరూ గమనించి సహకరించాలని కోరారు.

టీడీపీ నాయకుడు పొట్లూరి అర్ధనగ్న ప్రదర్శన



నూజివీడు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):పంచాయతీ టెండర్ పోస్టులలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ టీడీపీ నూజివీడు మండల మాజీ అధ్యక్షుడు, గొల్లపల్లి మాజీ సర్పంచ్ పొట్లూరి సత్యనారాయణ, గొల్లపల్లి సచివాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శనకు దిగారు. నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామపరిధిలో ఐదు టెండర్ పోస్టులను గతంలో వైసీపీ కార్యకర్తలను నిబంధనలకు విరుద్ధంగా నియమించారని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అందుకు నిరసనగా టీడీపీ జెండాను పట్టుకుని శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు.

మానవత శాంతి ర్యాలీ.. సేవా కార్యక్రమాలు



కైకలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కైకలూరులో శాంతి ర్యాలీని నిర్వహించారు. మానవత సేవా సంస్థ సభ్యులు, విద్యాంజలి విద్యాసంస్థ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. మానవత చైర్మన్ కొండ్రెడ్డి చిట్టెమ్మ, అధ్యక్షుడు గుర్రం శ్యాంకుమార్, ఉపాధ్యక్షులు దూలం వాసవి, డైరెక్టర్ పెద్దింటి కల్యాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థిని జాహ్నవికి రూ.7500 చెక్కును అందజేశారు.

మండవల్లి: సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు విజయగణేష్‌కుమార్ కోరారు. మండవల్లిలో సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శాంతి ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక జడ్పీహెచ్ స్కూల్లో మొక్కలు నాటారు.

బీమా పరిహారం అందించిన ఇండియన్ బ్యాంక్

మండవల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద మృతురాలి కుటుంబానికి ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.20లక్షల ప్రమాద బీమా పరిహారాన్ని అందించినట్లు జోనల్ మేనేజర్ రాజేష్, కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక మండవల్లి బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ 2023 డిసెంబరులో ఏలూరు నుంచి కైకలూరు వస్తున్న ఆర్టీసీ బస్సు కాకతీయనగర్ వద్ద ప్రమాదానికి గురవడంతో భైరవపట్నంకు చెందిన చింత శ్రీదేవి మృతి చెందారని, ఆమె గతంలో ఇండియన్ బ్యాంక్‌లో బీమా పథకాల్లో ప్రీమియం చెల్లించారని, దీంతో ఆమె కుటుంబానికి రూ.26,25,000 బీమా పరిహారం అందించారు.

రైతు బజారులో ప్లాస్టిక్ సంచుల నిషేధం

కైకలూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కొరకు ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు తగ్గించాలని రైతుబజారు ఎస్టేట్ అధికారి పి నందినీదేవి అన్నారు. శుక్రవారం కైకలూరు రైతుబజారులో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించి ప్రజలకు గుడ్డ సంచులను అందజేశారు. ఇకపై వ్యాపారులు క్యారీబ్యాగులు విక్రయించవద్దని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా గుడ్డ సంచులు వినియోగించాలని సూచించారు. రైతు బజారులో ప్లాస్టిక్ అమ్మకాలను నిషేధిస్తున్నట్లు తెలిపారు. రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సైదు గంగరాజు ఆశయాలు మహోన్నతం



కైకలూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొల్లేరు నాయకుడు సైదు గంగరాజు ఆశయాలు మహోన్నతమైనవని రాష్ట్ర వడ్డీ సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు అన్నారు. శుక్రవారం కొల్లేరు నాయకుడు సైదు గంగరాజు జయంతి సందర్భంగా శృంగవరప్పాడులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొల్లేరులో ఎలాంటి వసతులు లేని సమయంలో ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు నేటి యువత తెలుసుకోవాలన్నారు. అలాంటి నాయకుల త్యాగాలతోనే కొల్లేరు ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. టీడీపీ నాయకులు కొండలు, మాజీ సర్పంచ్ ఘంటశాల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి అభిమానుల రక్తదానం



చాట్రాయి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సినీ హీరో చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను చాట్రాయిలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు, అభిమాన సంఘం నాయకులు కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది చిరంజీవి అభిమానులు రక్తదానం చేశారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎస్సై రామకృష్ణ, నాయకులు మందపాటి బసవారెడ్డి, తుమ్మల జగన్, కరుణాకర్, నెల్లూరి సత్యనారాయణ, ఆదిమూలం శర్మ, వలసపల్లి రామకృష్ణ, కొల్లా శ్రీకాంత్, సవరం రామారావు, పాపారావు, గాజుల ప్రశాంత్, అభిమానులు పాల్గొన్నారు.

నిబద్ధత గల వ్యక్తి చిరంజీవి : ఎమ్మెల్యే కామినేని



కైకలూరు: శుక్రవారం శ్రీశ్యామలాంబ అమ్మవారి కళామండపం వద్ద చిరంజీవి అభిమానులు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కేక్ కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సినీ ప్రపంచంలో ఎంతో నిబద్ధతతో మెగాస్టార్ స్థాయికి ఎదిగారని అలాగే సినీ పరిశ్రమలో ఏ సమస్య వచ్చినా పెద్దమనిషిగా వ్యవహరించి వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఎంపీపీ అడవి కృష్ణ, మాజీ ఎంపీపీ అప్పారావు, కూటమి నేతలు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, పెన్మెత్స త్రినాథరాజు, వీరాబత్తిన సుధా, నల్లగోపుల చలపతి, కొల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.

కలిదిండి: కోరుకొల్లులో అభిమానులు చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిరంజీవి బర్త్ డే కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచారు. ఆసుపత్రిలోని రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కేశిరెడ్డి బలరామ్, వలవల రమేష్, గంగరాజు, అప్పన చిన్న, ఆమాజాల బాబులు, కేశిరెడ్డి రాజేష్, అందె బాబీ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: బీజేపీ నాయకుడు ఎం.రాజశేఖర్, బజారు దుర్గాప్రసాద్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో కేక్‌నుకట్ చేసి చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించారు. చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



ముదినేపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద అప్పీలుకు వచ్చిన దివ్యాంగులు

అర్హుల పెన్షన్లకు ఎసరు?

రీ అసెస్‌మెంట్‌లో భారీగా వైకల్యం తగ్గింపుపై లబ్ధిదారుల ఆవేదన

ముదినేపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బోగస్ పెన్షన్లు గుర్తించమంటే అర్హులకు ఎసరు పెట్టారని పలువురు దివ్యాంగులు ఆరోపించారు. అర్హులైన దివ్యాంగుల పెన్షన్ల ఏరివేతకు అధికారులు నిర్వహించిన రీ అసెస్‌మెంట్ (రీ వెరిఫికేషన్)లో ముదినేపల్లి మండలంలోని అర్హులైన పలువురు దివ్యాంగుల పెన్షన్లు రద్దయ్యాయి. సుమారు 20 ఏళ్ళపైబడి పెన్షన్ తీసుకుంటున్న వారు కూడా ఇప్పుడు పెన్షన్ల రద్దు నోటీసులు అందుకున్నారు. గతంలో 70 నుంచి 90 శాతం అంగవైకల్యం ఉన్నట్లు మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సర్టిఫికెట్లు ఇచ్చారు. వారి అంగవైకల్యంపై రీ అసెస్‌మెంట్ అవసరం లేదని కూడా ఆ సర్టిఫికెట్‌లో వైద్యులు పేర్కొన్నారు. వాస్తవానికి ఎటువంటి పనులు చేయ లేని స్థితిలో ఉన్నారు. పక్షవాతంతో బాధపడుతున్న వారి పెన్షన్‌ను కూడా రద్దు చేస్తూ మండల పరిషత్ అధికారులు నోటీసులు జారీ చేయటం విడ్డూరంగా ఉంది. అధికారులు తమ పింఛన్లను పునరుద్ధరించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

వైద్యులకు లంచం ఇచ్చినా..



పదేళ్లకుపైగా దివ్యాంగ పెన్షన్ తీసుకుంటున్నా. చిన్న వయస్సులోనే కాలు దెబ్బతిని వైకల్యానికి గురయ్యా. భర్త చని పోయాడు. 2013లో వైద్యులు 90 శాతం వైకల్యం సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పుడు తిరిగి పరిశీలించి 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో పింఛన్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారులు నోటీసులు పంపారు. తనను పరిశీలించేందుకు వచ్చిన వైద్యు లకు రూ.8 వేలు లంచం ఇచ్చా. అయినా అనర్హురాలినని సర్టిఫికెట్ ఇచ్చారు.

- మరీదు విష్ణు తులసి, కాకరవాడ, ముదినేపల్లి మండలం

పక్షవాతం ఉన్నా కనికరం లేదు



25 ఏళ్లుగా దివ్యాంగురాలి పెన్షన్‌ను తీసుకుం టున్నా. పక్షవాతంతో బాధపడుతూ ఎటువంటి పనులు చేయలేక మంచానికే పరిమితమయ్యా. అప్పట్లో తనకు 71 శాతం అంగవైకల్యం సర్టిఫికెట్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తనకు రూ.15 వేలు పెన్షన్ వస్తున్నది. ఇటీవల తనకు 40 శాతం కంటే తక్కువ అంగవైకల్యం ఉన్నట్లు వైద్యులు సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో నా పెన్షన్‌ను రద్దు చేస్తూ అధికారులు నోటీసు ఇచ్చారు.

- మొవ్వా సత్యవతి, వైఎస్ఆర్ కాలనీ, పెయ్యేరు, ముదినేపల్లి మండలం

ఫుడ్ సేఫ్టీ అధికార్ల తనిఖీలు

ముదినేపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్ల వెంబడి బహిరంగ ప్రదేశాల్లో అనధికారికంగా తినుబండారాల వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు ఫుడ్ సేఫ్టీ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కె. వెంకటరత్నం హెచ్చరించారు. సింగరాయపాలెం గ్రామ కూడలిలో రోడ్ల ప్రక్కనే నిర్వహిస్తున్న వ్యాపారాలను ఫుడ్‌సేఫ్టీ అధికార్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని హోటళ్ళలో పలుసార్లు వినియోగించిన నూనెను తిరిగి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. లైసెన్సు లేని వ్యాపారులకు నోటీసులు అందజేస్తూ ప్రతి చిన్న వ్యాపారానికి లైసెన్సు పొందాలని ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ రామరాజు ఆదేశించారు. లైసెన్సుల విధానంపై అవగాహన కల్పించారు.

ట్రిపుల్ ఐటీలో హ్యాకథాన్

నూజివీడు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అఖిల భారత స్థాయి అమరావతి క్వాంటమ్ ర్యాలీ హ్యాక్‌థాన్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. రెండురోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో టీసీఎస్, క్రిసి క్వాంటమ్ తదితర సంస్థలు మద్దతును అందించగా, కంప్యూటింగ్‌లో పరిజ్ఞానం, సమస్యల పరిష్కార పద్ధతులు తదితర అంశాలను విద్యార్థులు నేర్చుకున్నారు. కృష్ణదేవరాయ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమౌళి, బిట్స్ పిలాని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇంద్రాక్షిరాయ్ చౌదరి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు క్వాంటమ్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్ర కుమార్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



డెక్క తొలగింపునకు వితరణ

ముదినేపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని చేవూరు బ్రాంచి కాల్వలో గుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపు పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోయినా నీటి సంఘం అధ్యక్షుడు శాయిన వీర సూర్య ప్రసాదరావు చొరవతో ఈ పనులను నిర్వహించారు. శివారు భూములకు సాగునీరందక రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రసాదరావు తన సొంత నిధులతో చేవూరు ఛానల్‌లో పేరుకుపోయిన డెక్క తొలగింపు పనులు నిర్వహించి సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చేశారు.

రేపు రంగా విగ్రహావిష్కరణ

ముదినేపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం ఈడేపల్లిలో ఈ నెల 24న దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. గ్రామ రాధా - రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో జరుగనున్న ఈ కార్యక్రమంలో రంగా విగ్రహంతోపాటు ఆ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బండి వెంకన్నబాబు విగ్రహాన్ని కూడా ఆవిష్కరిస్తారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

యూరియా బ్లాక్ చేస్తే చర్యలు

ముదినేపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :ఎరువులు, పురుగు మందులు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ముదినేపల్లి తహసిల్దార్ లతీఫ్‌పాషా హెచ్చరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు ఏర్పడిన యూరియా కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెబుతూ ఈ పరిస్థితుల్లో ఎరువుల షాపుల డీలర్లు కూడా సహకరించాలని అన్నారు. ఎరువుల బ్లాక్ మార్కె టింగ్‌కు పాల్పడ వద్దని తెలిపారు. ఎటు వంటి అవకతవకలు బయటపడినా డీలర్ షిప్ రద్దుకు జిల్లా అధికార్లకు సిఫార్సు చేస్తామని తహసిల్దార్ హెచ్చరించారు.

జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలతో సంబంధం లేని జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టారని, సీఎం చంద్రబాబు ఆయనకు మద్దతు ఇవ్వాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోళ్ళ పవన్ కోరారు. వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు తెలుగురాష్ట్రాల నుంచి పార్టీలకు అతీతంగా సహకరించారని అదే రీతిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గెలుపు బాధ్యతను చంద్రబాబు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ముసునూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాసులుగా ఉన్న మహిళలను అక్షరాసులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపిడివో బి.ఏ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఏపీఎం రాంబాబు ఆధ్వర్యంలో అక్షరాంధ్రపై వీవోఏలు, సీసీలతో అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ అఫీసర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 6500 మంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నారని, ఫస్ట్ ఫేజ్‌లో 2400 మందిని అక్షరాసులుగా మార్చాలన్నారు. ఏపీడీ అనిత, ఎంఈవో సుబ్బారావు, మండల సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు ఉంటే చర్యలు

మండవల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాలు కలిగి ఉండడం నేరమని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ఎస్సై రామచంద్రరావు తెలిపారు. భైరవపట్నం పిట్టల వాళ్ల ఇళ్ల వద్ద శుక్రవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఈ ఏడాది జనవరి నెలలో ఇదే ప్రాంతాలు భారీ అగ్ని ప్రమాదం సంభవించి ఒకే కుటుంబంలో 5 గురు మృతి చెందిన విషయం విదితమేనని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

టీబీపై అవగాహన

కైకలూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీబీ యూనిట్ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ బి వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వై శ్రీలత ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం చేపడుతున్న ఇంటెన్సిఫైడ్ క్యాంపెయినింగ్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకినట్లు గుర్తించాలంటే రోగికి వారం రోజుల పాటు దగ్గు, జలుబు ఉంటే క్షయ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధి సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు, ఆర్థికసహాయాన్ని అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి సంధ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎన్ విజయకుమార్, ఎం హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళస్థలాల కేటాయింపునకు చర్యలు : తహసీల్దార్

ముసునూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ళస్థలాలను ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ దాసరి ప్రశాంతి అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో ఉన్న ఏనుగుగుట్ట ప్రాంతంలో ఇళ్ళస్థలాల కోసం శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించా రు. ఈ సందర్భంగా భూ రికార్డును, ఇళ్ళ స్థలాలకు భూమి అనుకూలంగా ఉం టుందా అని తహసీల్దార్ పరిశీలించి, స్థానికుల అభిప్రాయాన్ని అడిగి తెలు సుకున్నారు. సూమారు 4 ఎకరాల భూమిలో 200 మంది పేదలకు ఇళ్ళ స్థలా లు కేటాయించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పట్టాలు లేని వారికి లీజు చెల్లించం

కలెక్టరేట్ వద్ద ఉనికిలి గ్రామస్థుల ఆందోళన

ఏలూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టాలు లేని కొంత మంది వ్యక్తులు చెరువు లీజు సమానంగా పంచాలని ఆందోళనలు చేస్తున్నారని పోటీగా శుక్రవారం మండవల్లి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన స్థానిక కుటుంబాలు లీజులు చెల్లించే ప్రసక్తే లేదంటూ అధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన స్థానికులు లీజు సమానంగా పంచాలంటూ గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన స్థానికులు పోటీగా సభ్యత్వం లేని వారికి లీజు చెల్లించే అవసరం లేదంటూ కలెక్టరేట్ వద్ద శుక్రవారం పోటీ ధర్నా నిర్వహించారు. అనంతరం ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కే వెంకటరత్నం, సతీష్, జక్కుల ధామస్, జి ఏసురత్నం, వాసుపల్లి మిషక్, కారే ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి 'సహకారం' చేయూత

మంత్రి పార్థసారథి



చాట్రాయిలో కేడీసీసీ బ్యాంకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సారథి, గన్ని, నెట్టెం

చాట్రాయి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాభివృద్ధికి, మహిళలకు సహకార వ్యవస్థ ద్వారా మరింత చేయూతనివ్వాలని గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. చాట్రాయిలో కేడీసీసీ బ్యాంకు నూతన భవనాన్ని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బ్యాంకు చైర్మెన్ నెట్టెం రఘురామ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపటానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్ సింగిల్ విండో విధానాన్ని అమలోకి తెచ్చి సహకార వ్యవస్థకు జీవం పోశారని, తన తండ్రి పెద్ద రెడియ్య ఈ బ్రాంచ్‌ని ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. పోలవరం సహకార సంఘం ఆధ్వర్యంలో రైస్ మిల్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. గన్ని, నెట్టెం మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులకు దీటుగా కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు దేశంలో 3వ స్థానంలో ఉందన్నారు. రూ. 11వేల కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండటం గొప్ప విషయమన్నారు. కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్ మనోహర్, జీఎం రంగబాబు, డీజీఎం శ్రీనివాస్, చాట్రాయి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, సహకార సంఘాల అధ్యక్షులు, కూటమి నాయకులు నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ముసునూరు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరమని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రమణక్కపేట గ్రామానికి చెందిన ఘట్టం ప్రియాంక తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి రూ 1.50 లక్షల విలువగల ఏల్‌వోసీ చెక్కును ఆమె కుటుంబీకులకు మంత్రి పార్థసారథి శుక్రవారం అందజేశారు.

కార్యకర్తలకు రూ. 10 లక్షల అందజేత

చాట్రాయి: మండలంలోని యర్రావారిగూడెంకు చెందిన టీడీపీ కార్యకర్త యు. తిరుమలదేవి, చిన్నంపేటకు చెందిన టీడీపీ కార్యకర్త సిహెచ్ కృష్ణయ్య ఇటీవల వేరువేరు ప్రమాదాలలో మృతి చెందారు. వీరు రూ 100 టీడీపీ సభ్యత్వం కలిగి ఉండటంతో పార్టీ ప్రమాద భీమా పథకం కింద రూ 5 లక్షలు మంజూరు కావటంతో శుక్రవారం చాట్రాయిలో మృతుల కుటుంబాలకు మంత్రి సారధి, గన్ని వీరాంజనేయులు, నెట్టెం రఘురామ్ చెక్కులను అందజేశారు.

బీజేపీ ఉపాధ్యక్షులుగా తపన, నిర్మల



తపన చౌదరి, నిర్మలా కిశోర్, ఆదిలక్ష్మి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

బీజేపీ రాష్ట్ర కార్య వర్గంలో ఏలూరు జిల్లా నేతలకు ప్రాధాన్యత లభించింది. ఇంతకు ముం దు రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా ఉన్న తపన చౌదరి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న నిర్మలా కిశోర్‌లను తాజా కమిటీలో ఉపాధ్యక్షులుగా నియమించారు. ఏలూరు జిల్లాకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎల్.మాధవ్ కూర్పుచేశారు. తపన చౌదరి గత పార్లమెంటు ఎన్నికల్లో ఏలూరు స్థానాన్ని ఆశించారు. తగ్గట్టుగానే ఆయన నిర్విరామంగా నియోజకవర్గంలో కృషి చేశారు. ఖర్చుకు ఎక్కడా వెనుకాడలేదు. అయితే ఎంపీ స్థానం దక్క లేదు. పొత్తుల నేపథ్యంలో ఏలూరు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి పోటీ చేశారు. అయినా నిరాశ చెంద కుండా ఆయన పార్టీ కార్యక్రమా ల్లోనే నిమగ్న మవు తూ వచ్చారు. ఉత్తరాంధ్ర పరిశీలకులుగా ఉన్న చౌదరి కి ప్రమోషన్ ఇచ్చి ఉపాధ్యక్షులుగా నియమిం చడంతో పార్టీలో హర్షామోదాలు వ్యక్తమ య్యాయి. ఇప్పటి వరకు మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఉన్న నిర్మలా కిశోర్‌ను మరో ఉపాధ్యక్షు రాలిగా నియమించారు.

రాష్ట్ర కార్యదర్శిగా ఆదిలక్ష్మి

తాడేపల్లిగూడెం: బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా భోగిరెడ్డి ఆదిలక్ష్మి ఎంపికయ్యారు. తాడేపల్లిగూడేనికి చెందిన ఈమె 1992లో బీజేపీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. 1994లో తాడేపల్లిగూడెం అసెంబ్లీ ఎన్నికలో బీజేపీ తరఫున పోటీ చేశారు.

3న బీజేపీ అధ్యక్షుడు మాధవ్ రాక

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సారథ్యం యాత్రలో భాగంగా వచ్చే నెల 3న ఏలూరు వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎల్.మాధవ్ పర్యటనను ప్రతి బీజేపీ కార్యకర్త విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి పిలుపు నిచ్చారు. ఏలూరులో శుక్రవారం మాధవ్ పర్యటన సన్నాహక సమావేశం లో ఆయన మాట్లాడుతూ మాధవ్ తొలిసారి ఏలూరు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబరుగా, సర్పంచ్‌గా, ఎంపీటీసీ, జడ్పీటీసీగా పోటీ చేయడానికి కూటమి తరఫున అవకాశం అడగాలంటే మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా కిశోర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబికా కృష్ణ, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, శరణాల మాలతీరాణి, జ్యోతి సుధాకర కృష్ణ, కృష్ణప్రసాద్, అశోక్ చక్రవర్తివర్మ, నూజివీడు ఏఎంజీ చైర్మన్ అరుణ, ఏలూరు ఏఎంసీ వైస్ చైర్మన్ వాణీభాస్కర్ పాల్గొన్నారు.

లీజు మంటలు

(5వ పేజీ తరువాయి)

రావడం, ఉన్న నాలుగు రోజులు మీడియాలో ప్రచారం కోసం అనవసర గొడవలు సృష్టిస్తూ ఆకతాయితనంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. సంవత్సరానికి మూడుసార్లు చుట్టపుచూపుగా వచ్చే మీకు అసలు స్థానిక సమస్యల మీద మాట్లాడే అర్హత ఉందా.. అంటూ ప్రశ్నించారు. రేపు మళ్ళీ బ్యాగు సర్దుకుని పోతావు, ఈ నాలుగు రోజులు నీకు మీడియా కవరేజి కావాలని హడావుడి సృష్టించి పోతావంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏదో నష్టం జరిగిపోయినట్టు పరామర్శలా.. అంటూ కొండలరావు పాలెం వచ్చిన వైసీపీ నేతలను ఉద్దేశించి ప్రభాకర్ ప్రశ్నలు కురిపించారు. కొల్లేరువాసులకు వీలైతే న్యాయం చేయండి. ఇక్కడ జరుగుతుందేమిటో మీకు తెలుసా. మీ మాజీ ఎమ్మెల్యే ఏమీ తెలియని వాడిగా నటిస్తూనే అరాచకాలకు బీజాలు వేస్తున్నా రంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులకు పింఛన్లు తొలగిస్తే, వాటిని స్థానిక వైద్యులు ధ్రువీకరిస్తే నా మీద నిందలు వేస్తారా. దానికి, నాకు ఏం సంబం ధమంటూ ప్రశ్నించారు. వీధి రౌడీలు, బౌన్సర్లకు డబ్బు ఎర చూపి గ్రామాల్లో శాంతి భద్రతలకు అబ్బయ్య చౌదరి విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు.

ఆరోపణలు తగవు : డీఎస్పీ

నూజివీడు: పోలీసులు నిష్పాక్షికంగా విధులు నిర్వహించినప్పటికీ వైసీపీ నాయకులు అబ్బయ్య చౌదరి, పేర్ని నాని అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సహించమని నూజివీడు డీఎస్పీ ప్రసాద్ అన్నారు. నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ అనుమతులు తీసుకోకుండా కొండలరావుపాలెం కార్యకర్తలతో సమావేశానికి పిలుపునిచ్చారన్నారు. దీంతో ఆయన ఇంటికి భారీగా కార్యకర్తలు హాజరయ్యారని, ప్రణాళిక ప్రకారం అబ్బయ్య చౌదరి రౌడీషీటర్లును, బౌన్సర్లను ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇది తెలుసుకున్న కొల్లేరు గ్రామస్థులు, వీరికి మద్దతుగా ఉన్న కొంత మంది టీడీపీ కార్యకర్తలు కొండలరావుపాలెం వచ్చారని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసిందన్నారు. ఇరు వర్గాలు పోగైన తరువాత బౌన్సర్లు, రౌడీషీటర్లు కొల్లేరు రైతులపై తిరగబడ్డారని, దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగిందని వారిని ఆపడానికి ప్రయత్నించిన పోలీసులపై కూడా తిరగబడ్డారన్నారు. అయినా పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారన్నారు. ఈ క్రమంలో కొందరు టీడీపీ శ్రేణులు కూడా పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఇది గుర్తించి పోలీస్ విధులకు అడ్డంకి కల్పించారనే కారణంతో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామ న్నారు. ఇప్పటి వరకు బౌన్సర్ల వేషంలో వచ్చిన 9 మందిని గుర్తించామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తాము ఎవరి తరఫునా వకాల్తా పుచ్చు కోకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహి స్తున్నప్పటికీ తాము చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం పోలీస్‌లపై అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. వీరి ప్రవర్తనలో మార్పు రాకుంటే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

శుద్ధి చేసిన నీరే ఇవ్వండి

మండవల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులకు రక్షిత మంచినీటి పథకం నుంచి నీటిని శుద్ధి చేసి మాత్రమే విడుదల చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ ఆదేశించారు. పెరికేగూడెంలో తాగునీటి సమస్యలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించి శుక్రవారం పెరికేగూడెంలో క్షేత్రస్థాయిలో పర్యటన చేశారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు జాగ్రత్తలు తాగునీరు సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని వివరించారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఎఈ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి రాధిక పాల్గొన్నారు.

సైరన్ లేదు.. లైట్లు వెలగవు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వాసుపత్రికి చేరుకుని అక్కడే ఉన్న అంబులెన్సు వద్ద ఆందోళన చేపట్టారు. కండీషన్ లేని అంబులెన్సులను ఎలా పంపిస్తారంటూ అంబులెన్సు సరైంది లేకపోవడం వల్ల గోపీకృష్ణ ప్రాణాలు కోల్పోయాడని అంబులెన్సు డ్రైవర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన బండితోనే విధులను నిర్వర్తిస్తు న్నామని అది బ్యాకప్ వెహికల్ అని అసలైన వాహనం రిపేర్‌లో ఉందని చెప్పుకొచ్చారు. ఇలాంటి వాహనాలను రోడ్డెక్కించి ఎవరి ప్రాణాలు తీస్తారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లా డారు. ఏదైనా సమస్య ఉంటే ఫిర్యాదు చేయా లని సూచించారు. అయితే రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉండి ఆందోళన కొనసాగించారు.